

● బాపట్ల : పాతురాజుకొత్తపాలెం పాలాల్లో నిలిచిన వర్షపు నీరు

ముంపులోనే వరిపైరు

● అన్నదాతల వెతలు
● ఈ-క్రాప్ నమోదుకు ముందే తుడిచిపెట్టుకు పోయిన పైరు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ఎడతెరిపి లేకుండా గడచిన వారం కురిసిన కుండ పోత వర్షం.. రైతుకు తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. దీంతో వేల ఎకరాల్లో వరిపైరు ముంపుబారిన పడి కుళ్ల దశకు చేరుకుంది. దాదాపు మూడు రోజుల పాటు నీళ్లల్లోనే ఉన్న పైరు కొంత తేరుకునే సమయానికి మళ్లీ ఆదివారం రాత్రి నుంచి వాన కురుస్తోంది. దీంతో మళ్లీ పొలాలను వర్షపు నీరు ముంచెత్తింది. గడచిన 24 గంటల్లో జిల్లా వ్యాప్తంగా రెండు సెంటీమీటర్ల సగటు వర్షపాతం నమోదయినట్లు వాతావరణ శాఖ ప్రకటించింది. బాపట్ల, కర్లపాలెం, పిట్టలవానిపాలెం, రేపల్లె, నగరం మండలాల్లో భారీ వర్షం కురవగా, మిగిలిన మండలాల్లో ఓ మోస్తరు వర్షపాతం నమోదైంది. ఇప్పటి వరకు దాదాపు లక్ష ఎకరాల్లో ఖరీఫ్ సాగు కాగా ఇందులో 80 శాతం పనికిరాకుండా పోయినట్లేనని అన్నదాతలు వాపోతున్నారు. వ్యవసాయ శాఖ ప్రాథమిక అంచనాల ప్రకారమే 16,325 హెక్టార్లలో వరి ముంపు బారిన పడినట్లు తేల్చారు. ప్రస్తుతం కురిసిన వర్షాల ధాటికి ఈ సంఖ్య 20,000 హెక్టార్ల వరకు చేరొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

ఈ-క్రాప్.. 20 శాతమే

ఇప్పుడు ముంపు బారిన పడిన పైరులో ఈ క్రాప్ నమోదు అయింది 20 శాతం మాత్రమేనని సమాచారం. ఈ-పంటలో పైరు వివరాలు సమగ్రంగా నమోదు చేయాలంటే కనీసం నాట్లకు మూడు వారాల వ్యవధి ఉండాలని, కానీ ప్రస్తుతం మునకకు గురైన వరిపైరు అత్యధిక శాతం వారం క్రితం నాట్లు వేసినవేనని తెలుస్తోంది. ఇప్పుడు అదంతా నీటిపాలేనని రైతులు చెబుతున్నారు. కానీ ప్రభుత్వ పరంగా నష్టపరిహారం రావాలంటే పైరు ఈ క్రాప్ నమోదు తప్పనిసరని నిబంధనలు చెబుతున్నాయి.



గట్టుకు పడిన గండికి ఇసుక బస్తా అడ్డం వేస్తున్న కంకటపాలెం రైతు

పట్టని ప్రజాప్రతినిధులు

ప్రభుత్వం చెబుతున్నట్లుగా పీ-4 అమలు కావడం లేదని జిల్లాల వారీగా గణాంకాలను పరిశీలిస్తే అర్థమవుతోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మానస పుత్రికపై.. ప్రజా ప్రతినిధులు అంతగా దృష్టి సారిస్తున్న దాఖలాలు లేవు. ఒకరిద్దరు మినహా బంగారు కుటుంబాలను దత్తత తీసుకుంటున్నట్లు ప్రకటించలేదంటే వారికి ఈ పథకం అమలు పట్ల ఉన్న చిత్తశుద్ధి తెలియజేస్తుంది.

పీ-4.. పితలాటకం!



రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీ-4 కార్యక్రమం అమలులో అధికార యంత్రాంగం మల్లగుల్లాలు పడుతోంది. పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ప్రైవేటు, ప్రజల భాగస్వామ్యంను ప్రభుత్వం తీసు కొచ్చింది. వడపోతల అనంతరం పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాల పరిధిలో 1,85,223 బంగారు కుటుంబాలను నిర్ధారించారు. తొలి విడతలో మూడు జిల్లాల్లో 52,489 బంగారు కుటుంబాల దత్తత కార్యక్రమం నిర్వహించాలని అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. కానీ, మార్గదర్శ కుల ఎంపికలో మాత్రం.. జిల్లాకు 4 వేల మందిని మాత్రమే ఎంపిక చేసి.. దత్తత కార్యక్రమంలో పీ-4 సార్ధకత ఇదేనంటూ అధికారులు నిట్టూరుస్తున్నారు.

మూడు జిల్లాల్లో 1,85,223 బంగారు కుటుంబాలు

- తొలి విడతలో 52,489 కుటుంబాల దత్తత
- జిల్లాకు 4 వేల మంది మార్గదర్శకుల గుర్తింపు
- స్వచ్ఛందంగా దత్తతకు ముందుకు రాని వైనం
- అసలు పట్టనట్లు ప్రజాప్రతినిధుల వ్యవహారం

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాల మేర పీ-4 ముందుకు సాగుతున్న పరిస్థితి కానరావడం లేదు. ఎంపిక గడువు ముగిసినా అవసరం మేర మార్గదర్శకులు దొరకని పరిస్థితి నెలకొంది. మూడు జిల్లాల్లో అతి కష్టం మీద 12,695 మార్గదర్శకులను గుర్తించడంలో.. అధికార యంత్రాంగం నానా యాతన పడినట్లు తెలుస్తోంది. వీరందరూ బంగారు కుటుంబాలను దత్తత తీసుకుంటారా లేదా అన్న చర్చ జరుగుతోంది. కొన్ని చోట్ల బలవంతంగా మార్గదర్శకులుగా మారుస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. స్వచ్ఛందంగా మార్గదర్శకులుగా నమోదు చేసుకుంటున్న వారి సంఖ్య నామ మాత్రమేనని సమాచారం. అధికారులు కొందరిని బలవంతంగా మార్గదర్శకులుగా నమోదు చేశారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అధికారులపై ఒత్తిడి

ఒక్కో అధికారి ఒక బంగారు కుటుంబాన్ని దత్తత తీసుకోవాలని ఉన్నతాధికారులు ఒత్తిడి తెస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది. ఆగస్టు 15 కల్లా మార్గదర్శకుల ఎంపిక పూర్తి చేయాలని ప్రభుత్వం జిల్లా ఉన్నతాధికారులకు లక్ష్యాలను నిర్దేశించిన సంగతి తెలిసిందే.

జిల్లాల వారీగా పథకం తీరు ఇలా..

పల్నాడు జిల్లాలో 79,068 బంగారు కుటుంబాల ఎంపిక జరిగింది. ఇందులో 2,14,225 మంది కుటుంబ సభ్యులు ఉన్నారు. 52,308 కుటుంబాలను (మిగతా 6వ పేజీలో)

ఎరువుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలి

● కలెక్టర్ జె.వెంకటమురళి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటమురళి

బాపట్ల, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : రైతులకు యూరియా కష్టాలపై ఆంధ్రజ్యోతి దిన పత్రికలో ఆదివారం వెలువడిన కథనానికి కలెక్టర్ జె.వెంకటమురళి స్పందించారు. సోమవారం కలెక్టరేట్‌లో అధికారుల సమావేశాన్ని నిర్వహించి పలు సూచనలు చేశారు. షాపుల్లో డీఏపీ, యూరియా తగినంత అందుబాటులో లేదని రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై కలెక్టర్ మార్క్‌ఫెడ్, వ్యవసాయాధికారులను ప్రశ్నించారు. అయితే జిల్లాలో డీఏపీ, యూరియా తగినంత అందుబాటులో ఉందని , కొరత ఏర్పడుతుందనే ఉద్దేశంతో.. రైతులు ముందుగానే అధిక మొత్తంలో నిల్వ చేస్తున్నారని అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. అధిక ధరలకు ఎరువులు విక్రయి స్తే.. ఫిర్యాదు చేయాలని రైతులకు తెలిపారు. యూరియాను అన్ని సొసైటీలకు అందజేయాలని కలెక్టర్ డీఎం మార్క్‌ఫెడ్‌కు సూచించారు. బుధవారం నుంచి అన్ని రైతు సహాయ కేంద్రాల్లో యూరియా పంపిణీ చేస్తారని తెలిపారు. గ్రామాలలో విలేజ్ అసిస్టెంట్‌లు ఇంటింటికెళ్లి రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. రైతు సహాయ కేంద్రాల నుంచి ఎరువులు పంపిణీకి మ్యాపింగ్ పూర్తిచేసి పంపిణీ చేయాలన్నారు.

రాబోవు మూడు రోజుల్లో భారీ వర్షాలు..

జిల్లాలో రాబోవు మూడు రోజుల్లో భారీ వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయని జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. రెవెన్యూ డివిజన్ అధికారులు, తహసీల్దార్‌లు లోతట్టు ప్రాంతాలపై దృష్టి పెట్టి తగు చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. కృష్ణానది పరీవాహక ప్రాంతాల్లో ఉన్న మండల రెవెన్యూ అధికారులు వాచ్‌గార్డులను ఏర్పాటు చేయాలన్నారు. అధిక వర్షాలు వచ్చినప్పుడు గ్రామ, మండల, జిల్లాస్థాయిలో కంట్రోలు రూమ్‌లు ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. అధికారులు సెలవుపై వెళ్ళే పరిస్థితి లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి సంయుక్త కలెక్టర్ జి.గంగాధర్ గౌడ్, జిల్లా వ్యవసాయశాఖాధికారి సుబ్రహ్మణ్యేశ్వరరావు, జిల్లా కోఆపరేటివ్ అధికారి శ్యామసన్, డీఎం మార్క్‌ఫెడ్ కరుణశ్రీ తదితరులు పాల్గొన్నారు.

కొలువుల ఎర.. నిరుద్యోగులు విలవిల



● కలెక్టరేట్, వర్సిటీలో ఉద్యోగాలంటూ రూ.లక్షల్లో వసూళ్లు
● గుంటూరు నుంచి విశాఖ వరకు విస్తరించిన మాఫియా
● కీలకంగా డ్వామా మాజీ ఉద్యోగి..

'కలెక్టర్ ఆఫీసులో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం కేవలం రూ. 2 లక్షలు.. ఆచార్య ఎన్‌జీ రంగా వర్సిటీలో కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగం రూ.లక్షన్నరే.. నోటి మాటతో నమ్మాల్సిన పని లేదండీ.. ఇదిగో జాయింట్ కలెక్టర్ ఇచ్చిన అపాయింట్మెంట్ ఆర్డర్. మీకు ఇదే నేరుగా పోస్టులో వస్తుంది.' ఇదీ.. నిరుద్యోగులకు ఎరవేస్తున్న ఓ ముఠా తీరు.



ఫోన్ పే ద్వారా నగదు బదిలీ చేసినట్లు ఉన్న ఆధారం

మా నాన్న ఇంటికి రావొద్దంటున్నాడు..



మా నాన్న దివ్యాంగుడు. నాకు ఉద్యోగం వస్తుందన్న ఆశతో అప్పు తెచ్చి రూ. 2 లక్షలు ఇచ్చాను. నన్ను మోసం చేశారు. అప్పు ఇచ్చిన వాళ్లు మా నాన్న ఇం ట్లో అన్నం తింటుంటే బయటకు లాక్కొచ్చి కొట్టారు. మా నాన్న డబ్బులు తీసుకోకుండా ఇంటికి రావద్దు అంటున్నాడు. మొదట్లో ఎస్పీ చెప్పారని నగరంపాలెం పోలీసులు బాగానే స్పందించారు. మోసం చేసిన వ్యక్తిని పిలిపించి విచారించారు. ఈ నెల 10న డబ్బులు కడతానని ఒప్పుకున్న వ్యక్తి మళ్లీ స్పందించడం లేదు. చచ్చిపోవాలని ఉంది.

- ఎ.చిరంజీవి, నర్సీపట్నం

గుంటూరు సిటీ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): గుంటూరు, ఒంగోలు, విశాఖపట్నం తదితర ప్రాంతాల్లోని కొందరు ఒక ముఠాగా ఏర్పడి.. నిరుద్యోగులకు కుచ్చు టోపీ పెడుతున్నారు. గుంటూరు డ్వామా కార్యాలయంలో పనిచేసిన ఓ మాజీ ఉద్యోగి ఈ వ్యవహారంలో కీలకంగా వ్యవహరిస్తున్నట్లు సమాచారం. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన యువతను మోసం చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి.

వలలో చిక్కిన నర్సీపట్నం యువకులు..

అనకాపల్లి జిల్లా నర్సీపట్నంకు చెందిన ఇద్దరు యువకులు చిరంజీవి, పూర్ణ ఉద్యోగం కోసం (మిగతా 6వ పేజీలో)

ఎన్ని బార్లకైనా దరఖాస్తు చేసుకోవచ్చు..

గుంటూరు, పల్నాడులో 159 బార్ల లైసెన్స్‌లకు ఆహ్వానం

● గీత కార్మికులకు మరో 15 కేటాయింపు
● మూడేళ్ల కాలపరిమితి ● గుంటూరు ఎక్సైజ్ శాఖ డీసీ డాక్టర్ కె.శ్రీనివాసులు



ప్రసంగిస్తున్న గుంటూరు ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కే.శ్రీనివాసులు, అరుణ కుమారి, లతా

గుంటూరుకార్పొరేషన్ / నరసరావుపేట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): గుంటూరు, పల్నాడు జిల్లాలలో మొత్తం 159 బార్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గుంటూరు ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కె.శ్రీనివాసులు తెలిపారు. సోమవారం గుంటూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. గుంటూరు జిల్లాలో 110, పల్నాడు జిల్లాలో 49 బార్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. ఆఫ్‌లైన్, ఆన్‌లైన్, హైబ్రిడ్ మోడల్ మూడు విధానాల ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తామని చెప్పారు. సెప్టెంబర్ 1 నుంచి 2028 ఆగస్టు 31 వరకు మూడేళ్ల కాల పరిమితికి.. ఒక వ్యక్తి ఎన్ని బార్ లైసెన్స్‌లకు అయినా.. దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. బార్‌కి కనీసం నాలుగు దరఖాస్తులు వస్తేనే లాటరీ తీస్తామని స్పష్టం చేశారు. 50వేల లోపు జనాభా ఉంటే.. రూ.35 లక్షలు, 5 లక్షల లోపు జనాభా ఉన్న ప్రాంతాల్లో రూ.55 లక్షలు, అంతకు పైన జనాభా ఉంటే రూ.75 లక్షలు లైసెన్స్ ఫీజు ఉంటుందన్నారు. ఏడాదిలోగా ఆరు వాయిదాల్లో చెల్లించుకోవచ్చు అన్నారు. ప్రతి దరఖాస్తు, ప్రొసెసింగ్ ఫీజు రూ.5.10 లక్షలు (మిగతా 6వ పేజీలో)



పోతార్లంక వరద నీటిని పరిశీలిస్తున్న ఎస్పీ తుషార్ డూడి

ప్రాణ నష్టం లేకుండా భద్రతా చర్యలు

ఎస్పీ తుషార్ డూడి

భట్టిప్రోలు, కొల్లూరు ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : వరద ప్రవాహం వల్ల ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా అప్రమత్తంగా ఉండాలని.. ఎస్పీ తుషార్ డూడి పోలీసు సిబ్బందిని ఆదేశించారు. సోమవారం కొల్లూరు మండలంలోని దోనేపూడి వద్ద పోతార్లంక చప్టా, భట్టిప్రోలు మండలం పెదపులివర్రు చినరేవు వంతెనలపై ప్రవహిస్తున్న వరద నీటిని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ శ్రీనివాసరావు, ఎస్ఐలు అమరవర్ధన్, శివయ్యకు పలు సూచనలు చేశారు. కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లోని కృష్ణానది పరివాహక గ్రామాల్లో, లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. నీట మునిగిన కల్వర్టుల వద్ద భద్రతా చర్యలు తీసుకుని.. 12 చోట్ల పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

అప్రమత్తంగా ఉండాలి: ఆర్డీవో రామలక్ష్మి

కొల్లూరు: కృష్ణానది వరద పోటెత్తడంతో యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఆర్డీవో రామలక్ష్మి సూచించారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో బాలింతలు, వృద్ధులు, రోగులు, చిన్నారులను పునరావాస కేంద్రాలుసురక్షిత ప్రాంతాలకు తరలించేలా ఏర్పాట్లు చేయాలన్నారు.

శింగరకొండకు మరింత శోభ

● రాజగోపురాలు, ప్రాకారం పునఃనిర్మాణానికి సన్నాహాలు
● రూ.11 కోట్లతో అంచనాలు- ముందుకొచ్చిన దాతలు

అద్దంకి, ఆగస్టు18(ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం రాజగోపురాలు, ప్రాకారం పునఃనిర్మాణానికి సన్నాహాలు జరుగుతున్నాయి. ఇప్పటికే సుమారు రూ.7 కోట్లతో రాతి ముఖ మండపం నిర్మాణం పూర్తయింది. రాజగోపురాలు, ప్రాకారం నిర్మాణం చేపట్టాలని దేవదాయ శాఖ అధికారులు సిద్ధం కావడంతో దాతలు ముందుకు వచ్చారు. దక్షిణం వైపు ఉన్న ప్రధాన రాజగోపురం సుమారు రూ.5 కోట్ల వ్యయం అవుతుండగా, మిగిలిన మూడు రాజగోపురాలు రూ.2 కోట్ల చొప్పున రూ.6 కోట్ల ఖర్చు అవుతుందని దేవదాయశాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. దక్షిణ రాజగోపురంతో పాటు మరో రెండు రాజగోపురాల నిర్మాణంకు ముగ్గురు దాతలు ముందుకు వచ్చారు. మరో దాత కూడా సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. ఇటీవల ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ తిమ్మానాయుడు రాజగోపురాలు, ప్రాకారం నిర్మాణ పనులు గురించి విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌తో చర్చించారు. వెంటనే అంచనాలు సిద్ధం చేయించాలని మంత్రి చెప్పడంతో.. అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. దేవదాయశాఖ ఉన్నతాధికారుల నుంచి అనుమతులు తీసుకొని సంవత్సర కాలంలో పనులు పూర్తి అయ్యే విధంగా ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు.

ప్రస్తుతం దక్షిణ రాజగోపురం ఎత్తు లో ఉన్నందున.. కొత్తగా నిర్మాణం చేసే రాజగోపురాలు అన్ని ఒకే ఎత్తులో ఉండే విధంగా చూస్తున్నారు. దక్షిణ రాజగోపురం ముందు ఉన్న రోడ్డు కూడా ఎత్తు తగ్గించనున్నారు. కమ్మ సత్రం నుంచి రోడ్డు ఎత్తు తగ్గించుకుంటూ వచ్చి భవనాసి చెరువు వద్దకు వచ్చేసరికి రోడ్డు, దేవాలయం ఒకే ఎత్తులో ఉండే విధంగా రూపకల్పన చేయనున్నారు. రాజగోపురాలు, ప్రాకారం పూర్తి అయితే శింగరకొండ దేవాలయం రూపురేఖలు పూర్తిగా మారిపోనుంది.

శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం



పీ-4.. పితలాటకం!

(5వ పేజీ తరువాయి)

తొలి విడతలో దత్తత తీసుకునేలా నిర్ణయించారు. ఇందులో 27,760 కుటుంబాలను దత్తతకు 4,202 మంది మార్గదర్శకులను గుర్తించినట్లు అధికారులు తెలిపారు.

- బాపట్ల జిల్లాలో 57,388 బంగారు కుటుంబాలను గుర్తించారు. 1,44,569 మంది కుటుంబ సభ్యులున్నారు. 49,151 బంగారు కుటుంబాల దత్తత ప్రక్రియ చేపట్టనున్నారు. వీటిలో 8,179 కుటుంబాలకు 4,212 మార్గదర్శకులను గుర్తించారు.

-గుంటూరు జిల్లాలో 1,00,314 బంగారు కుటుంబాలను గుర్తించగా వీటిలో 2,77,330 మంది కుటుంబ సభ్యులు ఉన్నారు. 83,764 కుటుంబాల దత్తతకు ఏర్పాటు చేస్తున్నారు. ముందుగా 16,550 కుటుంబాల దత్తత ప్రక్రియ ప్రారంభించాలని అధికార యంత్రాంగం నిర్ణయించింది. 4,281 మార్గదర్శకులను ఎంపిక చేశారు.

కొలువుల ఎర.. నిరుద్యోగులు విలవిల

(5వ పేజీ తరువాయి)

అక్కడ ఉన్న ఒక వ్యక్తిని కలిశారు. అతని సూచన మేరకు గుంటూరులోని ఓ వ్యక్తి దగ్గరకు వారు వచ్చారు. గుంటూరు కలెక్టర్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం ఇప్పిస్తానని చిరంజీవి వద్ద రూ. 2 లక్షలు, పూర్ణ వద్ద రూ. 1.70 లక్షలు అతను తీసుకున్నాడు. ఇదంతా ఈ ఏడాది ఏప్రిల్, మే నెలల్లో జరిగింది. ఫోన్ పే ద్వారా నగదును బదిలీ చేశారు. గుంటూరు వ్యక్తి నగదు బదిలీ సమయంలోనే జాగ్రత్త వహించాడు. ఆ సొమ్మును బంగారం వ్యాపారికి బదిలీ చేయించాడు. కొంత మాత్రం తన ఖాతాతోపాటు, వాళ్ల సోదరి అకౌంట్‌కు బదిలీ చేయించుకున్నారు. నగదు తీసుకునే సమయంలో పది రోజుల్లోనే నియామకపు ఉత్తర్వులు ఇప్పిస్తామని హామీ ఇచ్చారు.

నకిలీ నియామక ఉత్తర్వులు

నిరుద్యోగులను నమ్మించడం కోసం ఈ ముఠా నకిలీ నియామక ఉత్తర్వులను తయారు చేసింది. అందులో గుంటూరు జాయింట్ కలెక్టర్ పేరు నిరుద్యోగులకు చూపించారు. జేసీ సంతకం దగ్గర మహిళా అధికారి పేరు ఉండడంతో.. అనుమానం వచ్చి ఇదేమిటి అని అడగగా.. మరొకరు కూడా అదే పోస్టులో ఉన్నట్లు నమ్మించే ప్రయత్నం చేశారు. పది రోజుల్లో చిరునామాకు నియామకపు ఉత్తర్వులు వస్తాయని చెప్పినట్లు బాధితులు చెబుతున్నారు. ఉత్తర్వులు రాకపోవడంతో బాధితులు గుంటూరుకు చెందిన వ్యక్తికి ఫోన్ కాల్ చేయగా స్పందన లేదు. మోసపోయమని తెలుసుకున్న బాధితులు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు.

వర్సిటీలో పరీక్ష కూడా పెట్టారు..

ఉద్యోగాల పేరుతో గుంటూరుకు చెందిన వ్యక్తి చాలా మందిని మోసం చేసినట్లు తెలుస్తోంది. మరొక మహిళ కూడా అదే వ్యక్తిపై ఈ మధ్య కాలంలో జిల్లా కలెక్టర్‌కు, ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఎన్‌జీ రంగా వర్సిటీలో కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగం ఇప్పిస్తానని ఆమెను ఏకంగా యూనివర్సిటీకి తీసుకెళ్లారు. కంప్యూటర్ పరీక్ష కూడా నిర్వహించినట్లు బాధితురాలు చెబుతోంది. దీంతో ఉద్యోగం సంగతి వాస్తవమేనని నమ్మి.. నగదు ముట్టజెప్పినట్లు తెలుస్తోంది. ఈ ముఠా గుంటూరు, ఒంగోలు, విశాఖపట్నం జిల్లాల్లో ఇటువంటి మోసాలకు పాల్పడినట్లు సమాచారం.

ఎన్ని బార్లకైనా దరఖాస్తు చేసుకోవచ్చు..

(5వ పేజీ తరువాయి)

చెల్లించాలన్నారు. దరఖాస్తుదారుడికి వయసు కనీసం 21 ఏళ్లు ఉండాలి అన్నారు. జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి అరుణకుమారి, సీఐ లత పాల్గొన్నారు.

గౌడ కార్మికులకు 15 బార్లు

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో గౌడ, గౌడ్ సంఘీలకు మొత్తం 15 షాపులు కేటాయించడం జరిగిందని గుంటూరు ఎక్సైజ్ శాఖ డీసీ శ్రీనివాసులు తెలిపారు. గుంటూరు కలెక్టరేట్‌లో జిల్లా జేసీ భార్గవ్ తేజ, పల్నాడు కలెక్టరేట్లో అధికారులు గౌడ సామాజిక వర్గాలకు సంబంధించిన ప్రాంతాలను ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. గుంటూరులో 10 బార్లను కేటాయించగా..గౌడకు 7, గౌడ్‌కు మూడు షాపులు కేటాయించామన్నారు. పల్నాడు జిల్లాలో కేటాయించిన 5 షాపుల్లో గౌడకు 3, గౌడ్‌కు 2 షాపులు నిర్ణయించినట్లు వెల్లడించారు. ఈ సామాజిక వర్గాలకు బార్ లైసెన్సు ఫీజు రూ.27.50 లక్షలుగా నిర్ణయించారు. సాధారణ బార్లకు ఏడాదికి లైసెన్సు ఫీజు రూ.55 లక్షలుగా ఉంది. ఏటా లైసెన్సు ఫీజును పెంచనున్నారు. రెండో ఏడాది రూ 60.50 లక్షలు, మూడవ ఏడాది రూ.66.55 లక్షలుగా లైసెన్సు ఫీజును ప్రభుత్వం నిర్ణయించింది. పల్నాడు జిల్లాలో బార్ లైసెన్సులకు బుధవారం కలెక్టర్ పి.అరుణ్‌బాబు గెజిట్ విడుదల చేయనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లపై ఆయన కలెక్టరేట్‌లో ఎక్సైజ్ అధికారులతో సమీక్షించారు. ఈ నెల 29 సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తు చేసుకోవాలని, 30న బార్లకు లాటరీ తీయనున్నారు.

పోలీసు నిఘాలో పట్టుబడ్డ 15 మంది గంజాయి ముఠా



పట్టుబడిన గంజాయి ముఠా సభ్యులతో డీఎస్పీ జనార్ధనరావు

తెనాలి క్రైం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : పోలీసుల ప్రత్యేక నిఘాతో 15 మంది సభ్యులు గల రెండు గంజాయి ముఠాలను అదుపులోకి తీసుకున్నట్లు తెనాలి డీఎస్పీ బీ జనార్ధనరావు వెల్లడించారు. సోమవారం త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో పట్టుబడిన ముఠాల వివరాలను వివరించారు. పట్టణంలోని సుందరయ్య కాలనీలో టీఆర్పీ చర్చి ప్రాంతంలోని ఖాళీ స్థలంలోని చెట్ల మధ్యలో గంజాయి ముఠా ఉందన్న సమాచారంతో త్రీ టౌన్ సీఐ రమేష్‌బాబు ఆధ్వర్యంలో పోలీసులు ఆకస్మిక దాడి చేసి 8 మంది నిందితులను అదుపులోకి తీసుకున్నారు. మరో నిందితుడు పరారయ్యాడు. ఇందులో ప్రధాన నిందితుడు బిహార్ రాష్ట్రానికి చెంది ప్రస్తుతం పొన్నూరులో నివాసం ఉంటున్న మృత్యుంజయకుమార్ బీహార్ నుంచి తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి తెనాలి ప్రాంతంలో అత్యధిక ధరకు చిన్న చిన్న ప్యాకెట్లుగా మార్చి అమ్మకాలు సాగిస్తున్నాడు. ఇతని వద్ద గంజాయి కొనుగోలు చేసిన యువకులు తాము గంజాయికి బానిసలై ఆదాయం కోసం అమ్మకాలు చేపడుతున్నారు. అదుపులోకి తీసుకున్న నిందితుల్లో పట్టణ ప్రాంతానికి చెందిన కరికట్ల మధు, దాది షణ్ముఖ, పఠాన్ మహ్మద్ ఫరీద్‌ఖాన్, ఆకుల మారన్న, సయ్యద్ సైదా, ఆరెమళ్ల విజయ్‌కుమార్, నిమిది సంతోష్‌కుమార్‌లు ఉన్నారు. పోలీసులను చూసి పారిపోతున్న వీరిని వెంబడించి పట్టుకోవడంలో సాహసం చేసిన సీఐ రమేష్‌బాబు, సిబ్బంది పీ మురళి, డీ సురేష్, ఎస్ జైకర్, అబ్దుల్ సలాంను డీఎస్పీ అభినందించారు. నిందితుల నుంచి 1.750 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని వారిని కోర్టుకు హాజరు పరిచినట్లు డీఎస్పీ తెలిపారు. కొల్లిపర పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన మరో గంజాయి కేసులో ఏడుగురు వ్యక్తులను రూరల్ సీఐ ఆర్ ఉమేష్ ఆదివారం సాయంత్రం అదుపులోకి తీసుకున్నారని డీఎస్పీ తెలిపారు. ఈ ముఠాలో ఐదుగురు గంజాయి అమ్మకందారులతో పాటు ఇద్దరు గంజాయి తాగుతున్న వారిని కొల్లిపర డంపింగ్ యార్డు వద్ద ఉండగా అదుపులోకి తీసుకోవడం జరిగింది. వీరి నుంచి 1.600 కిలోల గంజాయి 4 బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. పట్టుబడిన వారిలో కృష్ణా జిల్లా బిల్లపాడుకు చెందిన పంది నాగయుగంధర్‌బాబు, కృష్ణా జిల్లా గుడివాడ ముబారక్ సెంటర్‌కు చెందిన షేక్ రకీబ్, గుంటూరు జిల్లా ఉప్పలపాడుకు చెందిన పాత నేరస్తుడు రామిశెట్టి శ్యాం, ఇదే గ్రామానికి చెంది గతంలో రెండు కేసుల్లో నిందితుడిగా ఉన్న దుగునూరి మోహన్‌తేజ, 16 దొంగతనాల కేసులో నిందితుడిగా ఉన్న కొల్లిపర మండలం తూములూరుకు చెందిన కనపర్తి సుందరరావు, పోలీసుల దాడి సమయంలో గంజాయి సేవిస్తున్న షేక్ అబ్దుల్ కరీమ్, తూములూరుకు చెందిన విష్ణుమొలకల భరత్‌కుమార్‌లను అదుపులోకి తీసుకుని కోర్టుకు హాజరు పరిచడం జరిగిందని డీఎస్పీ వెల్లడించారు. ఈ ముఠాని అదుపులోకి తీసుకోవడంలో చాకచాక్యంగా వ్యవహరించిన తెనాలి రూరల్ సీఐ ఆర్ ఉమేష్, కొల్లిపర సీఐ పీ కోటేశ్వరరావు, సిబ్బంది పోతురాజు, రామకోటేశ్వరరావు, మురళి, నాంచారయ్య, రమేష్, నాగబాబు, నాగరాజులను డీఎస్పీ బీ జనార్ధనరావు ప్రత్యేకంగా అభినందించారు.

విద్యార్థుల క్రమశిక్షణే ఉన్నత శిఖరాలకు బాట



విద్యార్థులు, తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడుతున్న కిట్స్ కళాశాల చైర్మన్ కోయ సుబ్బారావు

చైర్మన్ కోయ సుబ్బారావు

వట్టిచెరుకూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులను విద్యతో పాటు క్రమశిక్షణే వారిని ఉన్నత శిఖరాలకు చేరుస్తుందని కళాశాల చైర్మన్ కోయ సుబ్బారావు అన్నారు. సోమవారం బీటెక్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలు పొందిన విద్యార్థినీ విద్యార్థులు వారి తల్లిదండ్రులతో కిట్స్ కళాశాల ప్రాంగణం కిక్కిరిసి పోయింది. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ కోయ సుబ్బారావు మాట్లాడుతూ నిష్ణాతులైన ఫ్యాకల్టీ అధ్యాపకుల బోధనతో పాటు విద్యార్థుల్లో క్రమశిక్షణకు తమ కళాశాల ప్రాధాన్యం ఇస్తుందన్నారు. అందువల్లనే సుదూర ప్రాంతాల నుంచి విద్యార్థులు, తల్లిదండ్రులు తమ కళాశాలను ఎంచుకోవ టమే అందుకు నిదర్శనమన్నారు. విద్యార్థులు మంచి ఉపాధి అవకా శాలు సాధించేందుకు అవసరమైన శిక్షణను నిపుణులైన అధ్యాపకులు అందించటం ద్వారానే సాధ్యమవుతుందన్నారు. విద్యార్థుల్లో సృజనా త్మకతను వెలికి తీయడానికి వివిధ రకాల ఇన్నోవేషన్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. తమ కళాశాలలోని విద్యార్థులకు ఉపాధి కల్పనే ధ్యేయంగా కాకుండా స్వయంగా కంపెనీలు స్థాపించేందుకు అవసరమైన నైపుణ్యాలను వివిధ స్టార్టప్ కంపెనీల సహకారం అందిస్తున్నామన్నారు. కళాశాల సెక్రటరి కోయ శేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతిక అంశాలపై ఎక్కువ అధ్యయనం చేయడం అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీ బాబు, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ కే హరిబాబు విద్యార్థులకు వారి కోర్సుల వివరాలను, పరీక్షల విధానం, శిక్షణ తరగతుల నిర్వహణ తదితర అంశాలను వివరించారు.

మాజీ మంత్రి అంబటిపై ఎస్పీకి ఫిర్యాదు

● మార్ఫింగ్ వీడియోలు పోస్ట్ చేయటం సిగ్గుచేటు ● డీసీఎంఎస్ చైర్మన్ వడ్రాణం హరిబాబు ధ్వజం

గుంటూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): పులివెందులలో ఎన్నికలు స్వేచ్ఛగా జరిగితే పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో 2023లో జరిగిన ఎన్నికల వీడియోను మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో మాజీ మంత్రి అంబటి రాంబాబు పోస్ట్ చేసి దుష్ప్రచారం చేస్తున్నారని ఆయనపై చర్యలు తీసుకోవాలంటూ ఎస్పీ సతీష్‌కుమార్‌కు డీసీఎంఎస్ చైర్మన్ వడ్రాణం హరిబాబు సోమవారం ఫిర్యాదు చేశారు. అనంతరం హరిబాబు మీడియాతో మాట్లాడుతూ ఎక్కడో జరిగిన వీడియోలను మార్ఫింగ్ చేసి పులివెందుల ఉప ఎన్నికలంటూ దుష్ప్రచారం చేసిన మాజీ మంత్రి అంబటి రాంబాబు సిగ్గుపడాల్సిన విషయం అన్నారు. గత ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పినా జగన్మోహన్ రెడ్డి అండ్ కో బ్యాచ్ తీరు మారలేదని ధ్వజమెత్తారు. సోషల్ మీడియాలో ఫేక్ వీడియోలు పెట్టి టీడీపీపై బురదజల్లడమే వైసీపీ నేతలు ధ్యేయంగా పెట్టుకున్నారని దుయ్యబట్టారు. ఫేక్ వీడియోలు, ఫేక్ వార్తలు ప్రసారం



మార్ఫింగ్ వీడియోలను మీడియాకు చూపుతున్న వడ్రాణం హరిబాబు

చేసి ప్రజలను తప్పుదోవ పట్టించడం పరిపాటిగా మారిపోయిందని మండిపడ్డారు. రాష్ట్రంలో జగన్ రెడ్డి బ్యాచ్ క్షుద్ర రాజకీయాలు మానుకోకపోతే పోతే రాబోయే రోజుల్లో శ్రీకృష్ణ జన్మస్థానంలో కూర్చోవడం అంబటి రాంబాబుకి కూడా తప్పదని హెచ్చరించారు.

ముగ్గురు బైక్ దొంగల అరెస్టు

● 9 బైకులు స్వాధీనం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావు

రేపల్లె, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): వ్యసనాలకు బానిసలై దొంగతనాలకు అలవాటుపడిన ముగ్గురిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించి వారి వివరాలను వెల్లడించారు. కొల్లూరు మండలం సుగ్గురులంక, కొల్లిపర మండలం గౌడపాలెం, అన్నవరంగౌడపాలేనికి చెందిన ఈ ముగ్గురూ.. మైనర్లేనన్నారు. వీరివద్ద నుంచి 9 బైక్‌లు స్వాధీనం చేసుకున్నామని, వాటి విలువ రూ.9.60 లక్షలన్నారు. వీరిపై జిల్లాలోని రేపల్లె, వేమూరు, మంగళగిరి, తాడేపల్లి, చందోలు, చెరుకుపల్లి, చిలకలూరిపేట, నిజాంపట్నం, పోలీస్ స్టేషన్‌లలో కేసులు ఉన్నాయన్నారు. రేపల్లెటౌన్ సీఐ మల్లికార్జునరావు, రేపల్లెలో బైక్ దొంగతనం కేసు నమోదు అవడంతో.. అధునాతన టెక్నాలజీ ఉపయోగించి ఈ ముగ్గురు మైనర్ బాలురను అదుపులోకి తీసుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ మల్లికార్జున్‌రావు, ఎస్ఐ రాజశేఖర్‌లు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

● రూ. 30 వేలు జరిమానా విధించిన కోర్టు

తాడికొండ, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నడిపే వారికి భారీ జరిమానాలను మంగళగిరి కోర్టు జడ్జి విధించారు. ఆదివారం తాడికొండ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. వాహనాలను తనిఖీలు చేస్తున్న క్రమంలో ముగ్గురు వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడు పుతున్నట్లు పోలీసులు గుర్తించారు. వారిపై కేసు నమోదు చేసి సో మవారం మంగళగిరి కోర్టులో హాజరు పరిచారు. మద్యం సేవించి వాహనం నడిపినందుకు ఒక్కొక్క వాహనదారుడికి రూ. 10 వేల చొప్పున ముగ్గురికి కలిపి రూ. 30 వేలు జరిమానాను జడ్జి విధించారు.

భూకబ్జాలపై నివేదికివ్వండి : కలెక్టర్

గురజాలటౌన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): గురజాల నియోజకవర్గ పరిధిలో భూకబ్జాలపై త్వరగా నివేదిక ఇవ్వాలని జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. సోమవారం రాత్రి పట్టణంలోని ఆర్డీవో కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. అనంతరం అధికారులతో సమావేశమయ్యారు. గత వైసీపీ ప్రభుత్వంలో నియోజకవర్గంలో ప్రభుత్వ భూముల ఆక్రమణపై నివేదిక ఇవ్వాలన్నారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అవినీతికి తావు లేకుండా సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో గురజాల ఆర్డీవో మురళీకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో సూచనలు చేస్తున్న కలెక్టర్ అరుణబాబు

జగనన్న ముద్దు.. రజినీ మాకొద్దు!

● మాజీ మంత్రికి వ్యతిరేకంగా అసమ్మతి సమావేశం ● చిలకలూరిపేటలో నాయకత్వ మార్పునకు డిమాండ్

చిలకలూరిపేట, ఆగస్టు18 (ఆంధ్రజ్యోతి): జగనన్నే ముద్దు, రజినీ మాకొద్దు అని ప్లకార్డులు చేతబూని నినదిస్తూ మాజీ మంత్రి విడదల రజినీకి వ్యతిరేకంగా ఆదివారం రాత్రి పట్టణంలోని ఒక ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో వైసీపీలోని ఒక వర్గం వారు సభ నిర్వహిం చారు. మాజీ మంత్రి రజినీ అరాచకాలు, అవినీతిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రధానంగా మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ బి.చిన్న మాట్లాడుతూ చిలకలూరిపేటలో రజిని నాయకత్వంలో తాము పనిచే యబోమని స్పష్టం చేశారు. తామంతా పార్టీ ఉన్నతి కోసం కృషి చేస్తా మని, నాయకత్వ మార్పు చేయాలని పార్టీ అధిష్టానాన్ని కోరారు. పీఏలను అడ్డంపెట్టుకుని దోచుకోవటమే లక్ష్యంగా రజిని అరాచకం సాగిందని, అక్రమంగా సంపాదించడం తప్ప రజిని చేసింది ఏమీ లేదని విమర్శించారు. ఐదు సంవత్సరాల్లో ఆమె చేసిన అరాచకాలు అన్ని ఇన్ని కాదని, సొంత పార్టీ వారిపైనే అనేక అక్రమ కేసులు పెట్టించారన్నారు. రియల్ ఎస్టేట్ వెంచర్లు, బైపాస్ రోడ్డు కాంట్రాక్టర్లు, ప్రభుత్వాసుపత్రి కాంట్రాక్టర్లు, మైనింగ్, భూదందాలు, కరోనా సమ యంలో పలు ఆస్పత్రుల వారి నుంచి అక్రమ వసూళ్లు, విద్యుత్ శాఖ లో ఉద్యోగాల పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడిన చరిత్ర రజినీదన్నారు.



సభలో పాల్గొన్న వైసీపీ అసమతి వర్గం నాయకులు

గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌కు తాత్కాలికంగా కొండపల్లిలో స్టాపేజ్ తొలగింపు

గుంటూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): నిత్యం గుంటూరు - సికింద్రాబాద్ మధ్యన రాకపోకలు సాగించే గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌కు కొండపల్లి రైల్వేస్టేషన్‌లో తాత్కాలికంగా నిలుపుదల సౌకర్యాన్ని తొలగించనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఏ శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రైలుకు అక్టోబరు 19 నుంచి నవంబరు 18వ తేదీ వరకు కొండపల్లిలో నిలుపుదల ఉండదన్నారు.

చెన్నై ఎక్స్‌ప్రెస్‌కి నాయుడుపేటలో స్టాపేజ్ సదుపాయం

నిత్యం గుంటూరు మీదగా ప్రయాణించే నంబరు. 12604 చర్లపల్లి - చెన్నై సెంట్రల్ చెన్నై ఎక్స్‌ప్రెస్‌కి ఈ నెల 19వ తేదీ నుంచి నాయుడుపేటలో నిలుపుదల సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు సీపీఆర్‌వో తెలిపారు.ఈ రైలు నాయుడుపేటకు వేకువజామున 3.03కు చేరుకొని 3.05కి బయలుదేరి వెళుతుంది.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



సింగపల్లి పున్నారెడ్డి (ఫైల్ ఫొటో)

క్రోసూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : క్రోసూరుకు చెందిన సింగంపల్లి పున్నారెడ్డి(55) అనే రైతు అప్పుల బాధ తాళలేక పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. పున్నారెడ్డి ఆదివారం రాత్రి 8:30 గంటల నుంచి కన్పించకుండా పోయాడని, సోమవారం ఉదయం వేల్పూరు శివారులోని పొలాల్లో మృతదేహం లభ్యమైందని తెలియ జేశారు. పొలం పనుల కోసం వెళ్ళిన స్థానికులు పున్నారెడ్డి మృతదేహాన్ని గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చినట్టు చెప్పారు. పున్నారెడ్డి తనకు ఉన్న కొద్దిపాటి పొలంతో పాటు మరి కొంత పొలాన్ని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేసేవాడని, వ్యవసాయం కలసి రాక అప్పుల బాధ ఎక్కువై బలవన్మరణానికి పాల్పడినట్టు తెలిపారు. రూ. 10లక్షల వరకు పున్నారెడ్డికి అప్పులు ఉన్నట్టు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పున్నారెడ్డి మృతి పట్ల పలు రాజకీయ పార్టీల నాయకులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలియ జేశారు.

సత్తెనపల్లిలో ఏటీఎం కార్డుతో మోసం

సత్తెనపల్లి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని 15వ వార్డుకు చెందిన రిటైర్డు ఉద్యోగి వెల్లటూరి సుబ్బారావు సోమవారం పాత బస్టాండ్ సమీపంలోని ఏటీఎంలో నగదు డ్రా చేసేందుకు వెళ్ళాడు. అక్కడే ఉన్న ఓ యువకుడు సాయం చేస్తానంటూ నమ్మ బలికి ఆయన ఏటీఎం కార్డును మార్చి ఇచ్చాడు. అనంతరం ఆ యువకుడు సుబ్బారావు ఏటీఎం కార్డు తీసుకొని వేర్వేరు ఏటీఎం కేంద్రాల నుంచి రూ 30వేలు వరకు నగదు డ్రా చేశాడు. సుబ్బారావు ఫోన్‌కు నగదు డ్రాకు సంబంధించిన సమాచారం వచ్చింది. దీంతో తాను మోస పోయాయని గుర్తించిన సుబ్బారావు పట్టణ పోలీసులు ఫిర్యాదు చేశారు. సుబ్బారావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నరసరావుపేట వైసీపీలో ముసలం

పాదయాత్ర వెంకటేశ్వర్ రెడ్డిపై దాడి చేసిన వైసీపీ నేతలు

నరసరావుపేట రూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : నరసరావుపేట మండలం రంగారెడ్డిపాలెంలో వైసీపీ నేతల మధ్య ఆధిపత్య పోరు ఘర్షణకు దారితీసింది. గ్రామంలోని వైసీపీ నాయకుడు పాదయాత్ర వెంకటేశ్వర్‌రెడ్డి అనే వ్యక్తి తనపై అదే గ్రామానికి చెందిన మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అనుచరులు దాడి చేశారని ఆరోపించారు. గ్రామంలో జరిగిన జగనన్న కాలనీ ఇళ్ల పట్టాలు, నూతనంగా నిర్మిం చిన సీసీ రోడ్ల నిర్మాణంలో రూ.3కోట్ల మేర అవినీతి జరి గిందని ఆరోపించారు. ఈ నే పథ్యంలో గ్రామంలో నిర్మిం చిన కళ్యాణ మండపం అద్దె వసూలు విషయంలో ఇరువ ర్గాల మధ్య వివాదానికి దారి తీసింది. దాడిలో పాదయాత్ర వెంకటేశ్వర్‌రెడ్డికి తీవ్రంగా గాయాలు కావడంతో నరసరా వుపేట ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. రంగారెడ్డి పాలెం గ్రామానికి చెందిన వైసిపి నాయకులు తనపై దాడి చేశారని నరసరావుపేట రూరల్ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు.

క్వాంటమ్‌పై ఉన్నత విద్యా ఫ్యాకల్టీకి శిక్షణ

అమరావతి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యా ఫ్యాకల్టీకి క్వాంటం టెక్నాలజీస్‌పై శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ఉన్నత విద్యామండలి చైర్మన్ కె.మధుమూర్తి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2026 మార్చి నాటికి 500 మందిని మాస్టర్ ట్రైనర్లుగా తయారుచేసి వారి ద్వారా 50వేల మంది విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం లక్ష్యమన్నారు. దీనివల్ల అమరావతి క్వాంటం వ్యాలీ మిషన్‌లో భాగంగా లక్ష మందికి ఉద్యోగాలు లభిస్తాయని, వందల సంఖ్యలో స్టార్టప్‌లు వస్తాయన్నారు. జైపూర్ ఎంఎన్ఐటీ, కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ, ఐబీఎం, టీసీఎస్, ఐఐటీ మద్రాస్, కేంద్ర ఎలక్ట్రానిక్స్ అండ్ ఐటీ శాఖలతో కలిసి శిక్షణ కార్యక్రమం ప్రారంభించామని వెల్లడించారు.

జనాభా లెక్కల కోసం సమన్వయ కమిటీ

అమరావతి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జనాభా లెక్కల సంబంధిత కార్యకలాపాలు, ప్రణాళికల కోసం ఉన్నతాధికారులతో ప్రత్యేక సమన్వయ కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ మేరకు సీఎస్ కె.విజయానంద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. దేశవ్యాప్తంగా రెండు దశల్లో జనాభా లెక్కల ప్రక్రియను నిర్వహించనున్నారు. మొదటి దశలో 2026 ఏప్రిల్ నుంచి సెప్టెంబరు మధ్య ఏదైనా 30 రోజుల వ్యవధిలో ఇంటింటి వివరాలు సేకరిస్తారు. 2027లో రెండో దశలో జనాభా గణన చేపట్టనున్నారు. రెండు దశలకు అవసరమైన ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని అన్ని రాష్ట్రాలకు కేంద్ర సెన్సెస్ ఆపరేషన్ డైరెక్టర్, సిటిజన్ రిజిస్ట్రేషన్ డైరెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో సీఎస్ నేతృత్వంలో 12 మంది సభ్యులతో సమన్వయ కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీకి సీఎస్ చైర్మన్‌గా, జీఏడీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ స్టేట్ కో-ఆర్డినేటర్‌గా, మెంబర్‌గా ఉంటారు. వీరితో పాటు రెవెన్యూ స్పెషల్ సీఎస్, పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి, ప్లానింగ్ ముఖ్య కార్యదర్శి, మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి, పాఠశాల విద్య కార్యదర్శి, ఐటీ సెక్రటరీ, గ్రామ, వార్డు సచివాలయాల డైరెక్టర్, పంచాయతీరాజ్ శాఖ కమిషనర్, మున్సిపల్ శాఖ కమిషనర్, సర్వే సెటిల్‌మెంట్ కమిషనర్, సెన్సెస్ ఆపరేషన్ డైరెక్టర్లను సభ్యులుగా నియమించారు.

రేపు డిగ్రీ అడ్మిషన్లకు నోటిఫికేషన్

అమరావతి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ అడ్మిషన్లకు బుధవారం నోటిఫికేషన్ జారీచేయనున్నట్లు ఉన్నత విద్యామండలి ఓ ప్రకటనలో తెలిపింది. అదే రోజు ఆన్‌లైన్‌లో డిగ్రీ అడ్మిషన్లకు దరఖాస్తులు స్వీకరించేందుకు షెడ్యూలు జారీచేస్తామని పేర్కొంది. ఆఫ్‌లైన్‌లోనూ దరఖాస్తులు తీసుకుంటామని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. దానిపై మండలి ఎలాంటి స్పష్టతా ఇవ్వలేదు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.20 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	123, 132, 142
చికెన్ విత్ స్కిన్(కిలో)	230.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	240.00

42,285 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 44,541 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 42,285 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 7,059 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	9500	13500
నెంబరు. 5	10000	13200
273	----	----
341	10000	14600
4884	---	----
సూపర్ 10	10000	13200
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	14500
షార్క్-1	-----	----
బ్యాడిగి	10000	13000
దేవనూరు డీలక్స్	10000	13300
ఆర్మూరు	9800	11200

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
ఏసీ కామన్ వెరైటీ		
334	9500	13600
నెంబరు. 5	10000	13500
273	----	---
341	11000	14800
4884	10000	12800
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	14200
బ్యాడిగి 355	10000	13100
దేవనూర్ డీలక్స్	10500	13500
ఆర్మూరు	---	---
తాలుకాయలు	5000	7200

పట్టణంలో పారిశుధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలి

● మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ జి.రఘునాథరెడ్డి

బాపట్ల, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో పారిశుధ్యం లోపించకుండా సిబ్బంది చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి సిబ్బందిని ఆదేశించారు. బాపట్ల పురపాలక సంఘ పరిధిలో వర్షాలు, వరదల దృష్ట్యా వార్డులలో చేపట్టాల్సిన పారిశుధ్య పనులను గురించి ప్రజాఆరోగ్య విభాగ అధికారులతో, సిబ్బందితో మున్సిపల్ కమిషనర్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డులలో మురుగునీరు ఎక్కడా కూడా నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఖాళీ స్థలాలను గుర్తించి సదరు యజమానులకు నోటీసులు జారీ చేసి పిచ్చిమొక్కలు పెరగకుండా నీరు నిల్వఉండకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గృహసముదాయాల మధ్య ఖాళీ స్థలాలలో నీరు నిలిచిన దృష్ట్యా దోమల లార్వా వృద్ధి చెందకుండా ఆయిల్‌బాల్స్ ఉంచాలని యాంటీలార్వా పిచికారి చేపట్టాలన్నారు. వార్డులలో డ్రైనేజి పూడికలు వేగవంతం చేయాలని ఆదేశించారు. వార్డులలో ప్రతిరోజు ఫాగింగ్ చేపట్టాలన్నారు. పట్టణానికి సరఫరా అయ్యే తాగునీటికి క్లోరినేషన్ పరీక్షలను తప్పక నిర్వహించాలన్నారు. లోతట్టు ప్రాంతాలకు ట్యాంకర్‌ల ద్వారా తాగునీరు సరఫరా చేయాలన్నారు. పైపులైన్ లీకేజిలను గుర్తించి యుద్ధప్రాతిపదికన సరిచేయాలన్నారు. ప్రమాదకర సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తంగా ఉంచాలని ఆదేశించారు.

బార్ షాపులకు దరఖాస్తులు చేసుకోవాలి

● జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి బి.వెంకటేశ్వర్లు


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

బాపట్ల, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం 2022-2025 బార్ పాలసీ రద్దు చేసి 2025-2028 సంవత్సరాలకు గాను నూతన బార్ పాలసీని విడుదల చేయటం జరిగిందని డిస్ట్రిక్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి బి.వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నూతన బార్ పాలసీలో లైసెన్స్ ఫీజు ఏ4 షాపుల లైసెన్సీ ఫీజులతో పోలిస్తే తక్కువ అన్నారు. నూతన బార్ పాలసీలో జిల్లాలోని బాపట్ల మున్సిపాలిటి-5, చీరాల మున్సిపాలిటి-7, రేపల్లె మున్సిపాలిటి-4, అద్దంకి నగరపంచాయతీ-1 మొత్తం 17 బార్‌లు, గీతకార్మికులకు సంబంధించి బాపట్ల మున్సిపాలిటి-1, రేపల్లె మున్సిపాలిటి-1 మొత్తంగా 19 బార్‌లు మంజూరు చేయటం జరిగిందన్నారు. సదరు బార్‌లకు కేటాయింపు పాతపద్ధతిలోని వేలం ద్వారా కాకుండా ఏ4 షాపులకు జరిగిన విధంగా డ్రాఆఫ్ లాట్స్ ద్వారా జరపబడుతుందన్నారు. సదరు లాటరీ పద్ధతిలో పాల్గొనే వారు రూ.5 లక్షల దరఖాస్తు ఫీజు, రూ.10 వేల ప్రాసెసింగ్ ఫీజును ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ లేదా హైబ్రీడ్ పద్ధతి ద్వారా చెల్లించాల్సి ఉంటుందన్నారు. దరఖాస్తులకు ఈనెల 26వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బాపట్ల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ పి.గీతిక, సబ్ ఇన్‌స్పెక్టర్‌లు ప్రభుదాసు, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

స్వామిత్వ అమలు తీరును పరిశీలించిన డీపీవో

బాపట్లరూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పంచాయతీ అధికారి కె.ఎల్.ప్రభాకర్ సోమవారం పడమర బాపట్ల పంచాయతీలో స్వామిత్వ అమలు తీరును పరిశీలించారు. పీపీఎంల ప్రకారం ఇంటికొలతలు 36కలమ్స్ ప్రొఫార్మానందు నమోదు పర్వే విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. స్వామిత్వ వలన ఇంటిహద్దులు ఖచ్చితంగా నిర్ణయించి తద్వారా హద్దులు వివాదాలు లేకుండా ఇంటి యాజమాన్యపు హక్కుపత్రాన్ని పొందటం ద్వారా అధికారిక డాక్యుమెంట్స్ ద్వారా బ్యాంక్ రుణాలను పొందవచ్చని తెలిపారు. డిప్యూటీ ఎంపిడివో రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి రవికుమార్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.


పడమర బాపట్ల పంచాయతీలోని స్వామిత్వ అమలు తీరును పరిశీలిస్తున్న డీపీవో ప్రభాకర్

శాస్త్రీయ దృక్పథమే సమాజాభివృద్ధికి ప్రాణవాయువు

బాపట్ల, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : శాస్త్రీయ దృక్పథంతోనే సుస్థిరమైన సమాజాభివృద్ధి సాధ్యమని, ప్రతి ఒక్కరు శాస్త్రీయ దృక్పథం జీవితాచరణగా కలిగియుండాలని డాక్టర్ చల్లా రామ్మోహనరావు అన్నారు. జనవిజ్ఞానవేదిక బాపట్ల జిల్లా 18వ మహాసభలు సోమవారం బాపట్ల పురపాలక ఉన్నత పాఠశాలలో జిల్లా అధ్యక్షుడు వై.భాస్కరరావు అధ్యక్షత నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన డాక్టర్ రామ్మోహనరావు మాట్లాడుతూ ప్రజలందరూ మూఢనమ్మకాలు వీడనాడాలని, ఆరోగ్య అలవాట్లు కలిగి ఉండాలన్నారు. ఆలిండియా పీపుల్స్ సైన్స్ నెట్ వర్క్, జాతీయ కమిటీ సభ్యులు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ 38 సంవత్సరాలు క్రితం డాక్టర్ మేధావులతో ఏర్పడిన జేవీవీ నేడు ఉపాధ్యాయ, ఉద్యోగులు, సామాన్య ప్రజానీకం చేరికతో విస్తృత పరిధిలో పని చేస్తుందని, జేవీవీలో సభ్యులుగా చేరి ఈ కృషిలో భాగస్వామ్యం కావాలని విద్యావంతులు, యువకులు, సైన్స్ అభిమానులను కోరారు. ఈ కార్యక్రమంలో జేవీవీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా హరిబాబు, శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.


జనవిజ్ఞాన వేదిక సైన్స్ ర్యాలీని ప్రారంభిస్తున్న జనవిజ్ఞాన వేదిక నాయకులు తదితరులు

మొక్కలు నాటిన జనసేన పార్టీ నాయకులు

బాపట్ల, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వారోత్సవాలలో భాగంగా సోమవారం బాపట్ల పట్టణ ఏరియా వైద్యశాలలో అఖండ ఫౌండేషన్ అధ్యక్షుడు, బాపట్ల జనసేన పార్టీ నాయకులు విన్నకోట సురేష్ ఆధ్వర్యంలో ఘనంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మానవసేవయే మాధవ సేవ అని నమ్మిన మెగాస్టార్ చిరంజీవి జన్మదినం పురస్కరించుకొని బాపట్ల ప్రాంతంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ప్రజల హృదయాలలో నిలిచిన వ్యక్తి ప్రజల కోసం బ్లడ్ బ్యాంక్, ఐ బ్యాంక్ స్థాపించి ఎంతో మందికి రక్తదానం, నేత్రదానం రెండు తెలుగు రాష్ట్రాలకు విపత్తుల సమయంలో చేయూతను మెగా ఫ్యామిలి అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బాపట్ల ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సిద్దార్థ, మెడికల్ ఆఫీసర్ ఆర్ఎంవో డాక్టర్ సుజాత లక్ష్మీ, శానిటేషన్ సూపర్‌వైజర్ రాజశేఖరరావు, విష్ణుమొలకల చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.


మొక్కలను నాటుతున్న అఖండ ఫౌండేషన్ అధ్యక్షుడు విన్నకోట సురేష్ తదితరులు

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

కర్లపాలెం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం మండలం పేరలి గ్రామ మల్లెలవారిపాలేనికి చెందిన దాసరి వెంకయ్యమ్మ మరణించారు. పేరలి నరసయ్య, తిమ్మరాజు కృష్ణమూర్తి మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పేరలి బాలకృష్ణమూర్తి సహాయ సహకారంతో గొర్రు ముచ్చు వీరయ్య చేతుల మీదగా మట్టి ఖర్చుల నిమిత్తం మృతుని కుటుంబ సభ్యులకు రూ.5 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవరంపాటి రాజు, గేరా ఏసుబాబు, మేకల బెంజిమెన్, అశోక్, గ్రామస్తులు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగాన్ని లాభసాటిగా చేయడమే ప్రభుత్వ ధ్యేయం

● ఎమ్మెల్యే ఆనందబాబు


రైతులకు రుణ చెక్కులు అందజేస్తున్న జీడీసీసీ చైర్మన్ మల్లికార్జునరావు, ఎమ్మెల్యే ఆనందబాబు తదితరులు

భట్టిప్రోలు (కొల్లూరు) ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ రంగాన్ని లాభసాటిగా చేయడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని, రైతు సమస్యలపై పూర్తి అవగాహన కలిగిన వ్యక్తి జీడీసీసీ బ్యాంకు చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు అని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. భట్టిప్రోలులోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో సోమవారం నిర్వహించిన వ్యవసాయ రుణాల చెక్కుల పంపిణీ కార్యక్రమానికి జీడీసీసీ చైర్మన్, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు హాజరయ్యారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా అధ్యక్షతన జరిగిన సభలో చైర్మన్ మాట్లాడుతూ, ఖరీఫ్ సీజన్ ప్రారంభం అయిన వెంటనే సకాలంలో సహకార సంఘాల ద్వారా రైతులకు రుణాలు అందించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. భట్టిప్రోలు సహకార సంఘంలో రైతులకు రూ.120 కోట్ల లావాదేవీలు జిల్లాలో పేరు పొందిందన్నారు. రుణాలతో పాటు సంఘాల ద్వారా రైతులకు కావాల్సిన యూరియా, డీఏపీ వంటి ఎరువులను కూడా సరఫరా చేసి రైతులకు అందజేయడం జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు రైతు సంక్షేమంతో పాటు రాష్ట్ర సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లగా చూస్తూ పరిపాలన చేస్తున్నారన్నారు.

ఎమ్మెల్యే ఆనందబాబు మాట్లాడుతూ, రైతులకు ఇబ్బంది లేకుండా సాగునీరు సకాలంలో అందించడం జరుగుతుందన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో రైతులకు ఎలాంటి రాయితీలు అందలేదని, ధాన్యం అమ్మకం రైతులు నెలల తరబడి నగదు కోసం ఎదురు చూడాల్సి వచ్చేదన్నారు. కూటమి ప్రభుత్వం ధాన్యం అమ్మిన రైతుల ఖాతాల్లో కేవలం 24 గంటల్లో నగదు జమ చేయడం జరిగిందన్నారు. అనంతరం 85 మంది రైతులకు రూ.5.31 కోట్లు చెక్కులను పంపిణీ చేశారు. ట్రాక్టర్ ప్రమాదంలో మరణించిన బొజ్జా యేసుబాబు అనే రైతు కుటుంబానికి రూ.2 లక్షల బీమా చెక్కును అందజేశారు. తొలుత సొసైటీ ఆవరణలో బ్యాంకు చైర్మన్, ఎమ్మెల్యే మొక్కలు నాటారు. సభ అనంతరం చైర్మన్‌తో పాటు ఎమ్మెల్యేను దుశ్శాలువా, పూలమాలలతో సొసైటీ అధ్యక్షులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గొట్టిపాటి పూర్ణకుమారి, మండల కన్వీనర్ వాకా శేషుబాబు, తహసీల్దార్ శ్రీనివాసరావు, బ్యాంకు ఏజీఎం డి.శ్రీనివాసరావు, సీఈవో వేములపల్లి శ్రీనివాస్, సంఘ డైరెక్టర్లు, సంఘ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ

కొల్లూరు ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు సోమవారం పంపిణీ చేశారు. కొల్లూరు గ్రామానికి చెందిన తూనుగుంట్ల శివశంకర్ రూ.85 వేలు, మురాల ఏడుకొండలు రూ.65 వేలు, పోలవరపు మల్లేశ్వరి రూ.55,437, పోలవరపు శ్రీకాంత్ రూ.42,833, జొన్నకూటి స్టీఫెన్‌రాజు రూ.31,759, సుంకర నీరజ రూ.15 వేలు, దోనేపూడి గ్రామానికి చెందిన యాగంటి బేబి సరోజిని రూ.42,983 మంజూరు కాగా వాటిని కొల్లూరు ఎంప్లాయీస్ రిక్రియేషన్ క్లబ్‌లో బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే ఆనందబాబుకు తమ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ, సంగం డెయిరీ డైరెక్టర్ జీఎల్‌జీ భగవాన్, ఈపూరు పీఏసీఎస్ అధ్యక్షుడు మేకా దివాకర్, డీసీ అధ్యక్షులు యలవర్తి కోటేశ్వరరావు, గొరికపూడి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


నేతాజి సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న డాక్టర్ పీసీ సాయిబాబు తదితరులు

భరతమాత ముద్దుబిడ్డ నేతాజి

● డాక్టర్ పీసీ సాయిబాబు

బాపట్ల, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : భరతమాత ముద్దుబిడ్డ నేతాజి అని ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పీసీ సాయిబాబు అన్నారు. నేతాజి 81వ వర్ధంతి కార్యక్రమాన్ని సోమవారం ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆయన విగ్రహానికి పుష్పాంజలి ఘటించి అక్కడ జరిగిన సమావేశంలో డాక్టర్ సాయిబాబు మాట్లాడుతూ నాడు భారతసైన్యాన్ని కూడా నేతాజి నిర్మాణం చేశారన్నారు. ఆయన అనేక దేశాలు సందర్శించి వారి మద్దతుతో దేశ స్వాతంత్ర్యం కోసం అహర్నిశలు శ్రమించారన్నారు. 11సార్లు జైలుశిక్ష అనుభవించి జైహింద్ నినాదాన్ని జాతికి అందించారన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం దగ్గుబాటి సురేష్, న్యాయవాది టి.భాస్కరరావు, బొట్టు కృష్ణ, గోపి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.


ఎంపీడీవో ఏలీషాబాబును ఘనంగా సత్కరిస్తున్న కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది

ఎంపీడీవో ఏలీషాబాబుకు ఘన సత్కారం

పిట్టలవానిపాలెం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : పిట్టలవానిపాలెం మండల ప్రజాపరిషత్ అభివృద్ధి అధికారి ఏ.ఏలీషాబాబు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఎంపీడీవో అవార్డును జిల్లా విద్యుత్ శాఖా మంత్రి రవికుమార్, కలెక్టర్ జె.వెంకటమురళి, ఎస్పీ తుషార్‌డూడి, బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, చీరాల ఎమ్మెల్యే ఎం.మాలకొండయ్య చేతుల మీదగా ప్రశంసపత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కార్యాలయం సమావేశపు హాలులో సోమవారం ఎంపీడీవో ఏ.ఏలీషాబాబును గ్రామపంచాయతీల కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు డి.ప్రసాదరావు, దాసరి వెంకట శివకుమార్, బి.సుజాత, డి.పద్మావతి, శ్రీనివాసరెడ్డి, ఎల్.నందకిషోర్, వెంకటరెడ్డి, కె.వసుంధర లక్ష్మి తదితర కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాండురంగాపురం ఆటోస్టాండ్ ప్రారంభం


ఆటోస్టాండ్‌ను ప్రారంభిస్తున్న పట్టణ ఎస్ఐ విజయ్‌కుమార్, సీఐటీయూ నాయకులు

బాపట్ల, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో సీఐటీయూ ఆధ్వర్యంలో పాండురంగాపురం ఆటోవర్కర్స్ యూనియన్ ఆటోస్టాండ్‌ను సోమవారం ఏర్పాటు చేశారు. నూతనంగా ఏర్పాటు చేసిన ఆటోస్టాండ్‌ను బాపట్ల పట్టణ ఎస్ఐ విజయ్‌కుమార్ సీఐటీయూ జెండాను ఆవిష్కరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ పరిమిత వేగంతో ఆటోలో ప్యాసింజర్‌లను పరిమితంగా ఎక్కించుకొని సురక్షితంగా గమ్యం చేర్చాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు, మత్తుపానీయాలకు బానిసలు కాకుండా సక్రమమైన మార్గంలో జీవనం సాగిస్తూ మంచి నడవడిక కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కె.శరత్, ఆటో యూనియన్ నూతన అధ్యక్ష, కార్యదర్శులు బి.రాఘవరెడ్డి, కె.ప్రేమ్‌చక్రవర్తి, కోశాధికారి జి.శివారెడ్డి, కార్మికులు శ్రీనివాసరెడ్డి, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలి

కొల్లూరు ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : ఆటోడ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ ఆటోవర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో డ్రైవర్లు ర్యాలీ నిర్వహించారు. కొల్లూరులో సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం బస్టాండ్ సెంటర్ నుంచి ఆటో డ్రైవర్లు ఆటోలతో ర్యాలీగా రెవెన్యూ కార్యాలయానికి చేరుకుని తహసీల్దార్‌కు సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు బొనిగల సుబ్బారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల వాగ్దానం ప్రకారం మహిళలకు ఆగస్టు 15 నుంచి ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిందన్నారు. ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడం సంతోషకరమైనప్పటికీ ఆటోడ్రైవర్లు స్వయం ఉపాధిపై ఆ ప్రభావం చూపుతుందన్నారు. వెంటనే ప్రభుత్వం ఆటోడ్రైవర్లను ఆదుకోవడంతో పాటు వెల్ఫేర్ బోర్డును తక్షణం ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు రాజు, రాజేష్, సభ్యులు నాంచారయ్య, శ్రీను, శివ, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న ఆటో యూనియన్ నాయకులు, కార్మికులు

నేడు బంగారు కుటుంబాలతో సీఎం ఆత్మీయ సమావేశం

చెరుకుపల్లి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : మంగళగిరిలోని సీకే కన్వెన్షన్ హాల్లో ఈనెల 19న రాష్ట్రవ్యాప్తంగా పి4 బంగారు కుటుంబాలతో ముఖ్యమంత్రి ఆత్మీయ సమావేశం జరుగుతుందని, ఈ సమావేశంలో చెరుకుపల్లి మండలం నుంచి ఏడు బంగారు కుటుంబాల సభ్యులు, మార్గదర్శులు పాల్గొంటారని ఎంపీడీవో షేక్ మహబూబ్ సుభాని ఒక ప్రకటనలో తెలిపారు.

మట్టి ఖర్చులకు ఆర్థిక సహాయం

వేమూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చావలి గ్రామంలో అనారోగ్య కారణాలతో నల్లూరి గురవయ్య భార్య అన్నమ్మ (80) ఆదివారం రాత్రి మృతి చెందగా విషయం తెలుసుకున్న గ్రేస్ ఫౌండేషన్ అధినేత డాక్టర్ కేతేపల్లి షాలేంరాజు మృతదేహాన్ని సందర్శించి తమ సంతాపాన్ని తెలియజేశారు. మృతురాలి మట్టి ఖర్చుల నిమిత్తం రూ.5 వేలు ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. గ్రామస్థులు కూచిపూడి సురేష్, ఫౌండేషన్ సభ్యులు బందెల కోటయ్య, పెరవలి మస్తాన్, అనిల్ పాల్గొన్నారు.

నిరుపేదలకు ఆర్థిక చేయూత

కర్లపాలెం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : నిరుపేదలకు శ్రీ ఛత్రపతి శివాజీ మహరాజ్ ఫౌండేషన్ ద్వారా ఆర్థిక చేయూతనందిస్తున్నామని ఫౌండేషన్ అధ్యక్షుడు శివాజి అన్నారు. శ్రీ ఛత్రపతి శివాజి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఒక పేద కుటుంబానికి 10 కేజిల బియ్యం అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంతెన పృధ్వీరాజు, మంతెన రామరాజు, పెనుమెత్స మల్లికార్జునరాజు, మంతెన సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

అనంత భోగేశ్వరస్వామికి అష్టోత్తర శత నామార్చన

కొల్లూరు ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : అనంత భోగేశ్వరస్వామి వారికి అష్టోత్తర శత నామార్చన నిర్వహించారు. శ్రావణ మాసం ఆఖరి సోమవారం కావడంతో స్థానిక గంగా పార్వతీ సమేత అనంత భోగేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారికి ప్రదోష కాలంలో తామర పూలు, బిల్వ దళాలతో అష్టోత్తర శత నామార్చన, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామి వారు విశేష అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. పూజలను ఆలయ అర్చకులు కొమ్మూరి వెంకట శివప్రసాద్, అనంత్, గాడేపల్లి శివ నిర్వహించారు.

కాల్వలో జారి పడిన వ్యక్తి మృతదేహం లభ్యం

చుండూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : దుండిపాలేనికి చెందిన యడ్లపల్లి ప్రశాంత్ (20) ఆదివారం ఉదయం సమీపంలోని తుంగభద్ర కాల్వలో కాళ్లు కడుగుతున్న క్రమంలో జారి పడి గల్లంతయ్యాడు. ప్రశాంత్ మృతదేహం సోమవారం సాయంత్రం తుంగభద్ర కాల్వలో దుండిపాలెం-యడ్లపల్లి మధ్య తూటికాడ ముళ్ల పొదల మధ్య తేలియాడుతుండగా గుర్తించినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. రేపల్లె ఆర్డీవో రామలక్ష్మి రెండు రోజుల పాటు సంఘటన స్థలంలోనే వివిధ బృందాలను సమన్వయపరిచి జారిపడిన యువకుని కోసం వెతికించారు. చివరకు ప్రశాంత్ మృతి చెందడంతో పంచనామా అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

వెద వరి పొలాల్లో చెరువులను తలపించిన వర్షపునీరు

బాపట్ల రూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మండలంలో రెండు రోజులు కురిసిన కుండపోత వర్షానికి మరలా సోమవారం తెల్లవారుజామున మూడు గంటల సేపు కురిసిన వర్షానికి మండలంలోని నరసాయపాలెం, మురుప్రోలువారిపాలెం గ్రామ పంట పొలాల్లో వెద వరి పంట నీటిలో నానుతూ ఉన్నది. ఈ రెండు గ్రామాలలో వరి పంట పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. అకాల వర్షం, అల్పపీడనం వలన ఏర్పడిన వర్షం రైతులకు తీవ్ర నష్టం మిగిల్చింది. కంకటపాలెం, పోతురాజుకొత్తపాలెం, అప్పికట్ల, పూండ్ల, భర్తీపూడి తదితర గ్రామాలలో వేసిన వెద వరి పంట నీటి పాలు అవ్వటంతో ఆ పొలాలను దుక్కి దున్ని నాట్లు వేసే పనిలో రైతులు నిమగ్నమౌతున్నారు.


నరసాయపాలెం గ్రామంలో చెరువులను తలపిస్తున్న వరి పంట పొలాలు

ఓలేరు కరకట్టను బలపరుస్తున్న ఆర్‌సీ అధికారులు

రేపల్లె, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : పలు ప్రాంతాల్లో కరకట్ట బలహీనంగా ఉండటంతో సోమవారం 'ఆంధ్రజ్యోతి' ఎడిషన్‌లో 'ఎవరికి పట్టని కరకట్ట... వరదల సమయంలో హడావుడితో సరి' అనే శీర్షిక న కథనం ప్రచురించటంతో ఆర్‌సీ అధికారులు స్పందించారు. భట్టిప్రోలు మండలం నుంచి రేపల్లె మండలం వరకు కరకట్టను పరిశీలించి ప్రమాదభరితంగా ఉన్న వాటిని గుర్తించారు. ఓలేరు సమీపంలో కరకట్ట బాగా బలహీనంగా ఉండటంతో ఇసుకబస్తాలతో బలపరిచినట్లు ఆర్‌సీ ఏఈ నాగేశ్వర్‌నాయక్ తెలిపారు. వర్షాలు, కృష్ణానదికి వరదనీరు పోటెత్తటంతో ఆర్‌సీ అధికారులు కనిపించకపోవటంతో కృష్ణాకరకట్ట వెంట ఉన్న గ్రామాల్లోని ప్రజలు ఎన్నిసార్లు విన్నవించుకున్నా పట్టించుకోవటం లేదని, ఇప్పటికైనా అధికారులు వచ్చి కట్టని బలపరచాలని కోరారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


ఓలేరుపల్లెపాలెం వద్ద కృష్ణా కరకట్టను బలపరుస్తున్న ఆర్‌సీ అధికారులు

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కుల పంపిణీ

రేపల్లె, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : వైద్యం చేయించుకోలేని నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థికంగా ఆదుకోవటం జరుగుతుందని మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. సోమవారం నియోజకవర్గంలోని వైద్యం చేయించుకోలేని 30 మంది నిరుపేదలకు రూ.20 లక్షలు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి చెక్కులను అందజేశారు. మంత్రి అనగాని సత్యప్రసాద్ పేదలకు అండగా నిలిచేందుకు వైద్యం చేయిచుకోలేని బాధితులకు సీఎం రిలీఫ్‌ఫండ్ ద్వారా ఆర్థికంగా ఆదుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో గోలి శేషుకుమార్, తొట్టెంపూడి సుభాష్, దేవగిరి రవి తదితరులు పాల్గొన్నారు.


సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేస్తున్న అనగాని శివప్రసాద్

వ్యవసాయ రంగం అభివృద్ధికి కృషి

నగరం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బొడ్డువారిపాలెం ప్రాథమిక సహకార వ్యవసాయ పరపతి సంఘం(పీఏసీఎస్) సొసైటీ నూతన అధ్యక్షుడు దండమూడి నాగమల్లేశ్వరరావు, డైరెక్టర్లు నాగళ్ళ సాయిబాబు, ఎస్కే ఇస్సాక్ వలీ సోమవారం ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అనగాని శివప్రసాద్ హాజరై నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు, డైరెక్టర్లుకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం సొసైటీ మరింత సేవలు అందించాలని సూచించారు. గ్రామంలో వ్యవసాయ రంగ అభివృద్ధి, రైతులకు రుణ సౌకర్యాలు, ఎరువులు, విత్తనాల పంపిణీలో పారదర్శకతతో పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక రైతులు, గ్రామ ప్రముఖులు, సొసైటీ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

భారీ వర్షాలకు ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలి

వేమూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రకటన దృష్ట్యా మండల పరిధి గ్రామాల్లోని ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ సుశీల ఆదేశించారు. తహసీల్దార్ కార్యాలయంలో కలెక్టర్ ఆదేశాల మేరకు వివిధ శాఖల అధికారులతో సోమవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, వ్యవసాయ శాఖ సిబ్బంది తాము పని చేస్తున్న గ్రామాల్లోనే ఉండాలని ఎప్పటికప్పుడు వాతావరణ పరిస్థితులు గమనించాలని సూచించారు. చెరువులు, కాల్వల వద్దకు ప్రజలు వెళ్లకుండా చూడాలన్నారు. కాల్వల గట్లు తెగినా పల్లపు ప్రాంతాల్లో నివాసితులకు ఎలాంటి ఇబ్బంది కలిగిన ఇతరమైన ఎలాంటి సంఘటనలు చోటు చేసుకున్నప్పటికీ తక్షణ చర్యలతో పాటు మండల, డివిజన్, జిల్లా అధికారుల దృష్టికి వాటిని తీసుకురావాలని అన్నారు. ఏమాత్రం అలసత్వం వహించినా చర్యలు తీసుకోక తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ రవీంద్ర, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ చెన్నకేశవరెడ్డి, వ్యవసాయ శాఖ అధికారి ప్రేమ్‌సాగర్, వీఆర్వోలు, ఇతర శాఖల ఉద్యోగులు హాజరయ్యారు.


వేమూరులో జరిగిన అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ సుశీల

అందుబాటులో ఎరువులు : ఏడీఏ

అమృతలూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : ఎరువుల కోసం రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, పుష్కలంగా ఎరువులు అందుబాటులో ఉన్నాయని బాపట్ల ఏడీఏ ధనరాజ్ అన్నారు. మండల పరిధిలోని సహకార సంఘాల్లోని ఎరువుల నిల్వలను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గోవాడలో రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రసుత్తం 140 మెట్రిక్ టన్నుల డీఏపీ, 120 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. అమృతలూరు సొసైటీకి 19.85 మెట్రిక్ టన్నుల యూరియా, ఇంటూరు సొసైటీలో 39.60 టన్నుల యూరియా అందుబాటులో ఉందని చెప్పారు. రానున్న రెండు, మూడు రోజుల్లో మండలంలోని అన్ని సహకార సంఘాల్లో డీఏపీ అందుబాటులో ఉంటుందని తెలిపారు. అనంతరం ఖరీఫ్ సీజన్‌లో జరుగుతున్న పంట నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అమృతలూరు ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ క్రొత్తపల్లి రవీంద్రబాబు, ఏవో హేమంత్‌భరత్‌కుమార్, విస్తరణాధికారులు మణికంత, మాధవి, వీఏఏలు డి.భాస్కర్, నందిని, నరేంద్ర, రైతులు పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా గుర్రపు డెక్కను తొలగించిన రైతులు


జంపని వద్ద కాల్వల్లో స్వచ్ఛందంగా రైతులు గుర్రపు డెక్కను తొలగింపజేస్తున్న చిత్రం

వేమూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్ సాగు ప్రారంభమైనప్పటికీ మురుగునీటి పారుదల శాఖ ద్వారా కాల్వల్లో పూడికలు తీయకపోవడం వల్ల నీటి ప్రవాహానికి పెరిగిన గుర్రపుడెక్క అడ్డుపడి మురుగునీరు గట్లు తెంచుకుని వరి నాట్లు దెబ్బతినే పరిస్థితి ఏర్పడింది. అధికారులు ఏ మాత్రం స్పందించకపోవడం వల్ల వేమూరు మండలం జంపని గ్రామ పరిధిలోని రైతులు సోమవారం స్వచ్ఛందంగా గుర్రపు డెక్కను తొలగింపజేసి మురుగునీటి ప్రవాహానికి అడ్డు తొలగించారు. నీటి పారుదల శాఖకు సంబంధించిన ఉన్నతాధికారులు స్పందించి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.



పిడుగురాళ్ల మార్కెటింగ్ సొసైటీ గోడౌన్‌లో నిల్వవున్న ఎరువుల బస్తాలు

ఆర్‌ఎస్కేలకు.. ఎరువుల సరఫరా ఎప్పుడు!?

గ్రామాల్లో రైతుల ఇబ్బందులు

డ్రెయిన్ల పారుదల కాక రైతుల అవస్థలు

అధికారులకు విన్నవించినా ఫలితం శూన్యం

పిడుగురాళ్ల, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): రైతు సేవా కేంద్రాలకు ఎరువుల సరఫరా ఇప్పటికీ జరగలేదు. నాగార్జున సాగర్ ఆయకట్టు పరిధిలో పల్నాడులోని గురజాల, మాచర్ల ప్రాంతాల్లో మెట్ట భూముల్లో గత నెలలోనే పత్తి సాగు చేయగా, వచ్చే నెల మొదటి వారంలోగా మిరప నారు సాగు చేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. మిగిలిన మాగాణి భూములలో గత పది రోజులుగా రైతులు వరినాట్లు వేయడం ముమ్మరంగా సాగించారు. బోర్లు, బావులు ఉన్న మాగాణి భూముల్లో 20 రోజుల క్రితమే వరినాట్లు వేయగా సాగర్ ఆయకట్టు పరిధిలో కొద్దిరోజులుగా వరినాట్లు సాగుచేయడం రైతులు వేగవంతం చేశారు.

ఎప్పుడు వస్తాయో..

పల్నాడు ప్రాంతంలో గురజాల, మాచర్ల నియోజకవర్గాల పరిధిలో సుమారు 108 రైతు సేవా కేంద్రాలు ఉన్నాయి. సుమారు 25 వేల హెక్టార్లకు పైగా మాగాణి భూములుండగా ఇప్పటికీ 11 వేల హెక్టార్లలో వరినాట్లు పూర్తయ్యాయి. కానీ, ఆయా రైతు సేవా కేంద్రాలకు ఇప్పటి వరకు ఒక్క బస్తా కూడా ఎరువు చేరలేదు. దీంతో రైతులు వరి నాట్లు వేసినా సకాలంలో ఎరువులు చల్లేందుకు అందు బాటులో లేకపోవడంతో ఆందోళన చెందుతు న్నారు. సమీప పట్టణాల్లోని ప్రైవేటు ఎరువుల దుకాణాలు, మన గ్రోమోర్ సెంటర్లు, మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఎరువులు, పురుగు మందుల విక్ర యాలు జరుగుతూనే ఉన్నాయి. ప్రతి గ్రామంలోని రైతు సేవా కేంద్రాలకు ఎరువులు రాకపోవడంతో.. మండల కేంద్రాలకు పరుగులు తీస్తున్నారు. అదన పు బాడుగ ఖర్చు భరిస్తున్నారు. మార్క్‌ఫెడ్ కేంద్రాలలో డీఏపీ, 20-20-20, 10-26-10, 28-28-28 రకాల ఎరువులు మాత్రమే అందుబాటులో వున్నా యి. పల్నాడు ప్రాంతంలో వరితో పాటు పత్తి, మిరప, మొక్కజొన్న సాగు చేస్తున్న రైతులలో ఎక్కువ మంది గోదావరి కంపెనీ యూరియానే అడుగుతున్నారు. ప్రైవేటు దుకాణాలకు అంతగా సరఫరా లేకపోవడంతో డిమాండ్ తలెత్తు తోంది.

దివ్యాంగ పింఛన్లలో అనర్హుల గుర్తింపు

సర్వేంద్రియాల్లో.. వైకల్యం బయట పడింది

- పల్నాడులో 3,217 మందికి నోటీసులు
- ప్రత్యేక సర్వేలో గుర్తించిన ప్రభుత్వం
- అర్హతుంటే 30 రోజుల్లో అప్పీలుకు అవకాశం

సత్తెనపల్లి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇష్టారాజ్యంగా పెన్షన్‌లు ఇచ్చేశారు. కొందరు వైద్యులను ప్రసన్నం చేసుకొని.. ఒత్తిడి తెచ్చి సదరన్ సర్టిఫికెట్లు పొందారు. ప్రస్తుతం దివ్యాంగ పింఛన్లు తీసుకుంటున్న వారికి కూటమి ప్రభుత్వం చెక్ పెడుతోంది. ప్రభుత్వం వచ్చిన తర్వాత పింఛన్‌ల సొమ్మును పెంచింది. దివ్యాంగులకు రూ.3వేల నుంచి రూ.6 వేల పింఛను చేసింది. మరో వైపు మంచానికే పరిమితమైన వారికి పెన్షన్‌ను రూ.10వేలు నుంచి రూ.15 వేలకు పెంచింది. గత ప్రభుత్వంలో అనర్హులు కూడా పెన్షన్లు పొందుతున్నారని ఫిర్యాదులు అందాయి. ఎక్కువగా వైసీపీ సానుభూతిపరులు, కార్యకర్తలు ఇటువంటి పింఛన్లు పొందిన వారిలో ఉన్నారు. అనర్హులకు లబ్ధి చేకూరుతుందని ఫిర్యాదులు వెల్లువెత్తడంతో కూటమి ప్రభుత్వం దీనిపై సర్వే చేపట్టింది. అనర్హులుగా కొంత మందిని వైద్య బృందం సర్వే చేసి గుర్తించింది.

3,217 మంది అనర్హులు..

పల్నాడు జిల్లా వ్యాప్తంగా 35,542 మంది దివ్యాంగులు పింఛన్లు పొందుతున్నారు. వీరిలో 3,217 మందిని అనర్హులుగా గుర్తించి సచివాలయాల ద్వారా నోటీసులు జారీ చేస్తున్నారు. ఈ ఏడాది జనవరి 6 నుంచి 31వ తేదీ వరకు పింఛన్‌ల వెరిఫికేషన్ చేశారు. వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. దివ్యాంగులకు ప్రత్యేక సద రన్ క్యాంపులు ఏర్పాటు చేసి.. వారి సర్టిఫికెట్లు కరెక్టుగా ఉన్నాయా? లేదా? అనే అంశాన్ని పరిశీలించారు. అనర్హులను గుర్తించి.. సచివాలయాల వారీగా నోటీసులు జారీ చేస్తున్నారు. మరోసారి సదరన్ సర్టిఫికెట్ చేయించుకొని రావాలని, అప్పుడు పింఛను ఇస్తారని వారికి చెబుతున్నారు. ఇలా అనర్హులకు జూలై నెల పింఛన్ నిలుపుదల చేశారు. నోటీసులు అందుకున్న పింఛనుదారులు సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

30 రోజుల్లో అప్పీలు చేసుకోవాలి

ఈ విషయంపై డీఆర్‌డీఏ పీడీ ఝాన్సీరాణి స్పందిస్తూ.. పల్నాడు జిల్లాలో నోటీసులు అందుకున్న పింఛన్‌దారులు పాత సదరన్ సర్టిఫికెట్, తాజాగా అందిన నోటీసు తీసుకొని ఏరియా వైద్యశాలకు వెళ్లి సంబంధిత డాక్టర్‌తో పరీక్ష చేయించుకోవాలన్నారు. నిబంధనల ప్రకారం ఉన్న ప్రొఫార్మాలో మాన్యువల్ సర్టిఫికెట్ పొందాలన్నారు. నోటీసులు అందుకున్న వారంతా 30 రోజుల్లోపు అప్పీలు చేసుకోవాలని ఆమె సూచించారు.



పింఛన్లలో.. మార్పులు

దివ్యాంగత్వం 85 శాతానికి పైబడి ఉండి మంచానికే పరిమిత మైన వారికి రూ15వేలు, అంత కంటే తక్కువ 40 శాతం కంటే ఎక్కువ ఉంటే మెడికల్ పింఛన్ నుంచి రూ.6 వేలకు మార్పు చేస్తున్నారు. 40 శాతానికి కంటే అంగవైకల్యం తక్కువగా ఉండి 60 సంవత్సరాల పైబడి ఉంటే రూ.4 వేలు వృద్ధాప్య పింఛన్‌కు బదిలీ చేస్తారు. 60 ఏళ్ల కంటే తక్కువ వయస్సు ఉంటే పింఛన్ తొలగి స్తారు. 40 శాతం కంటే ఎక్కువ దివ్యాంగత్వం ఉంటే రూ.6వేలు పింఛన్ యథావిధిగా మంజూరు చేస్తారు.

పారేదెలా..

గుర్రపుడెక్క తొలగేదెలా..!

రేపల్లె, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): అధికారులు, ప్రజాప్రతినిధుల ప్రకటనలు ఆర్భాటాలేనని మరోసారి రుజువైంది. రేపల్లె నియోజకవర్గంలో ప్రధాన డ్రెయిన్‌లు తూటికాడ, జమ్మిగడ్డి ఏపుగా పెరిగి మురుగు నీరు పారుదల లేక.. పంట పొలాల్లో వర్షపునీరు తిష్టవేయడం ఇందుకు అద్దం పడుతోంది. వైసీపీ ప్రభుత్వంలో కనీసం డ్రెయిన్లను పట్టించుకున్న పాపాన పోలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక.. అధికారులకూ రైతులు సమస్యలను విన్నవించుకున్నా.. పట్టించుకున్న దాఖలాలు లేవు. డ్రెయినేజీ అధికారులకు పలుమార్లు విన్నవించుకున్నా.. కార్యాలయం వద్ద ధర్నా చేసిన కనీస స్పందన లేదంటూ మునుసుబువారిపాలెం, రేపల్లె, ఉప్పూడి రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రేపల్లె మండలంలోని పెనుమూడి, అరవపల్లి, గుడ్డికాయలంక, నగరంమండలంలో గంగోలు, మంగళగుంట, తోటపల్లి ఎక్స్‌టెన్షన్, చెరుకుపల్లి మండలం గూడవల్లి మెయిన్, కావూరు, నిజాంపట్నం మండలం కూచినపూడి, అడవులదీవి, నిజాంపట్నం డ్రెయిన్లలో ఏపుగా గుర్రపుడెక్క పెరిగిపోయింది. ఈ డ్రెయిన్ల కింద సుమారుగా 70 ఎకరాలు పైనే వరి సాగు చేస్తున్నారు. నాలుగురోజులుగా కురుస్తున్న వర్షాల కారణగా డ్రెయిన్‌లో మురుగు పారుదల కాక పంట పొలాల్లోనే వర్షపు నీరు నిలిచిపోయింది. దీంతో వేసిన వరినాట్లు మునిగిపోయి రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పొలాలు భీడుగా మారిపోతున్నాయంటూ వేలాది రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైన ఉన్నతాధికారులు దృష్టి సారించి పూడికతీత చేపట్టాలని రైతులు కోరుతున్నారు.



గుడ్డికాయలంక డ్రెయిన్‌లో ఏపుగా పెరిగిన జమ్మిగడ్డి, గుర్రపుడెక్క

బండారుపల్లి సొసైటీ అధ్యక్షుడి నియామకంలో

వివాదం

- ప్రమాణ స్వీకారం చేస్తే ఉపేక్షించేది లేదన్న టీడీపీ శ్రేణులు
- సొసైటీ ఎదుట ఆందోళన చేసిన నాయకులు
- వాయిదా పడిన ప్రమాణస్వీకారం



బండారుపల్లి సొసైటీ ఎదురుగా ఆందోళనలు వ్యక్తం చేస్తున్న టీడీపీ శ్రేణులు

తాడికొండ(బండారుపల్లి)ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బండారు పల్లిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షుడి నియామకంలో టీడీపీలోని వర్గ విబేధాలు బయటపడ్డాయి. బండారుపల్లి సొసైటీకి అధ్యక్షుడిగా గుంటుపల్లి పానయ్యను నియమించినట్లు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. దీంతో పానయ్య సోమవారం సొసైటీ అధ్యక్షుడి బాధ్యతలు స్వీకరించటానికి సిద్ధపడ్డారు. ఈ క్రమంలో టీడీపీలోని మరో వర్గం నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. సొసైటీ అధ్యక్షుడి ప్రమాణ స్వీకారం చేస్తే ఉపేక్షించేది లేదంటు టీడీపీ శ్రేణులు సొసైటీ వద్ద ఆందోళనలు చేపట్టారు. సొసైటీ అధ్యక్షుడి నియమాకంలో సీనియర్ నాయకులు, కార్యకర్తలను సంప్రదించకుండానే పదవులు కట్టబెట్టారంటూ విషయం కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వద్దకు ఆదివారం చేరింది. నామినేటెడ్ పదవులు ఇచ్చేటప్పుడు పార్టీ కోసం 40 ఏళ్ల నుంచి కష్టపడి పనిచేసిన సీనియర్ నాయకులకు కనీస సమాచారం ఇవ్వకుండానే పదవులు పందేరం చేస్తున్నారని వాపోయారు. సొసైటీ అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేస్తే ఒప్పుకోమని, స్థానిక నాయకులతో సంప్రదింపులు జరిపిన తరువాతే సొసైటీ అధ్యక్షుడిని నియమించాలని కేంద్ర మంత్రి కార్యాలయంకు తెలియజేశారు. అయితే సోమవారం ఉదయం 10 గంటలకు సొసైటీ అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించాలని గుంటుపల్లి పానయ్య వర్గం నిర్ణయించుకుంది. విషయం తెలిసిన మరో వర్గం నాయకులు,కార్యకర్తలు సొసైటీ కార్యాలయం వద్దకు చేరుకొని ఆందోళనలు చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్, వైసీపీ ప్రభుత్వాలు ఉన్నప్పుడు తమపై కేసు పెట్టించి, జైలుకు పంపిన వ్యక్తికి సొసైటీ చైర్మన్ పదవి ఎలా ఇస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ. 20 లక్షల పెట్టి పదవిని కొనుకున్నారని గ్రామంలో ప్రచారం జరుగుతుందని తెలిపారు. మా ఎమ్మెల్యే డబ్బులు తీసుకునే వ్యక్తి కాదని పేర్కొన్నారు. ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ అందుబాటులో లేరని, వారితో మాట్లాడిన తరువాత మాత్రమే ప్రమాణ స్వీకారం చేయాలని డిమాండ్ చేశారు. అయితే ఇరువర్గాలతో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి గుంటుపల్లి మదుసూదనరావు చర్చలు జరిపి ప్రమాణ స్వీకారాన్ని వాయిదా వెయించారు. రెండు మూడు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని తెలిపారు. అయితే టీడీపీలో రెండు వర్గాల మధ్య వివాదం జరుగుతుందనే సమాచా రంతో ముందుస్తుగా గ్రామంలో పోలీసులు పికెటింగ్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పీ శేషయ్య, సొసైటీ మాజీ చైర్మన్ దండమూడి సాంబశివరావు, పార్టీ మండల మాజీ అధ్యక్షులు మానుకొండ శివరామకృష్ణ, పార్టీ గ్రామ మాజీ అధ్యక్షులు దండమూడి వెంకట్రావు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెరిగిన ప్రయాణాలు

- విజయవంతంగా స్త్రీ శక్తి పథకం
- పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్‌లలో జీరో ఫేర్ టిక్కెట్ల జారీలే అత్యధికం
- 45 నుంచి 60 శాతానికి పెరిగిన మహిళల ఆక్యుపెన్సీ



కిక్కిరిసిన బస్సుల్లో తోచుకుంటూ ఎక్కుతున్న మహిళా ప్రయాణికులు



గుంటూరులోని ఎన్‌టీఆర్ బస్టాండ్‌లో ప్రయాణికుల కోలాహలం

గుంటూరు, తెనాలి రూరల్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న స్త్రీ శక్తి పథకంపై మహిళల్లో సంతోషాన్ని నింపుతోంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఆర్టీసీలో మహిళల ఉచిత ప్రయాణ పథకం విజయవంతంగా సాగుతోంది. రోజురోజుకు మహిళా ప్రయాణీకుల సంఖ్య పెరుగుతోన్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎటువంటి ఇబ్బంది లేకుండా పథకం అమలు జరుగుతోందని నెల్లూరు జోన్ డిప్యూటీ సీటీఎం రవికాంత్ తెలిపారు.

45 నుంచి 60 శాతానికి పెరిగిన ఆక్యుపెన్సీ

స్త్రీ శక్తి పథకం అమలుతో ఆర్టీసీ ఉమ్మడి గుంటూరు జిల్లాలో 45 నుంచి 60 శాతానికి మహిళా ప్రయాణీకుల ఆక్యుపెన్సీ పెరిగినట్లు గణాంకాలు చెబుతున్నాయి. పథకాన్ని ప్రారం భించిన తొలి రోజు ఈనెల 15న విభజిత గుంటూరు జిల్లాలో 4800 మంది మహిళా ప్రయాణీకులు వారి వారి గమ్యస్థానాలకు చేరుకున్నా రని, పల్నాడు జిల్లాలో 5,293 మంది మహిళా ప్రయాణీకులు సద్విని యోగం చేసుకొన్నారని, బాపట్ల జిల్లాలో 4200 మంది జీరో ఫేర్ టిక్కెట్ల తో ప్రయాణించారని గణాంకాలు తెలియజేస్తున్నాయి. అలానే మూడో రోజు 17వ తేదీకి మహిళా ప్రయాణీకుల సంఖ్య మరింత పెరిగింది. పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో మహిళా ప్రయాణీకుల సంఖ్యే అత్యి ధికంగా ఉంటోందని చెబుతున్నారు. మూడో రోజున గుంటూరు జిల్లాలో 90 వేల మంది మహిళా ప్రయాణీకులు కాగా, పల్నాడు జిల్లాలో లక్షా 10వేల మంది, బాపట్ల జిల్లాలో 55 వేల మంది మహిళా ప్రయాణీకులు జీరో ఫేర్ టిక్కెట్‌తో ప్రయాణించినట్లు గణాంకాలు చెబుతున్నాయి.

ఫలించిన ముందస్తు ప్రణాళికలు....

స్త్రీ శక్తి పథకం అమలు నేపథ్యంలో అధికారుల ముందస్తు ప్రణాళికలు సత్ఫలితాలనిస్తున్నాయని చెబుతున్నారు. ఎక్కడా ఎటువంటి ఇబ్బందు లేకుండా పథకం అమలు జరుగుతోందని చెబుతున్నారు. పల్లె వెలుగు బస్సుల్లో ఫుట్ బోర్డు విస్తరణ, లోపల నిల్చొన్న మహిళలు పట్టుకునేలా హ్యాండిల్ స్లింగ్స్, అత్యవసర ద్వారం వంటి ఏర్పాట్లు చేశారు.

కొరవడిన పర్యవేక్షణ

సోమవారం తెనాలి పాత బస్టాండ్ వద్ద బస్సులు నిలిపే సమయంలో వందల సంఖ్యలో మహిళలు బస్సుల కోసం బారులు తీరి ఉన్నారు. ప్రతి పదినిముషాలకు ఒక బస్సు వస్తున్నా ఆయా బస్సులలో మహిళలతో కిక్కిరిసి ఉంటున్నారు. ఈ క్రమంలోనే పాత బస్టాండ్ వద్దకు బస్సు రాగానే అందులో ఎక్కి ప్రయాణం చేసేందుకు మహిళలు పోటీపడ్డారు. ఈక్రమంలో ఓ వృద్ధుడు బస్సు ఎక్కుతుండగా తోపులాట చోటుచేసుకుని కిందపడిపోయాడు. సమీపంలోని మహిళలు అతడిని పైకిలేపి సపర్యాలు చేశారు. గతంలో ఆ ప్రాంతంలో ప్రయాణీకులను ఎక్కించేందుకు ఆర్టీసీ డిపోకి చెందిన పలువురు అధికారులను, సిబ్బందిని నియమించేవారు. వారు బస్సును నిలపుదల చేయడం, ప్రయాణీకులు ఎక్కిన తరువాత పంపించడం వంటివి చేసేవారు. ప్రస్తుతం అటువంటి వారు కనబడటంలేదు. ఫలితంగా బస్సు ఎక్కేసమయంలో ప్రమాదాల బారిన పడుతున్నారు. పెరిగిన బస్సు ప్రయాణీకులకు తగ్గట్టుగా ఎటువంటి ప్రమాదాలు జరగకుండా సిబ్బందిని ఏర్పాటు చేసి ప్రయాణీకులు సురక్షితంగా గమ్యస్థానాలకు చేరేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

కృష్ణానదికి పెరిగిన వరద ప్రవాహం

అప్రమత్తమైన అధికార యంత్రాంగం

26 క్రస్ట్‌గేట్ల ద్వారా నీటి విడుదల

విజయపురిసౌత్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ జలాశయానికి శ్రీశైలం నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. సోమవారం శ్రీశైలం నుంచి 3,31,699 క్యూసెక్కుల వరద నీరు వస్తుండడంతో ప్రాజెక్ట్ అధికారులు 26 క్రస్ట్‌గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయం నీటిమట్టం 585.80 అడుగులు ఉంది. ఇది 299.74 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 6006, ఎడమ కాలువ ద్వారా 4949, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 28,826, 8 క్రస్ట్ గేట్లను 10 అడుగులు, 18 క్రస్ట్‌గేట్లను 5 అడుగుల మేర ఎత్తి 2,51,182 క్యూసెక్కులు, ఎస్‌ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్‌ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 2,93,663 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.



26 క్రస్ట్‌గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

తీర గ్రామాల్లో అప్రమత్తం

అచ్చంపేట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కృష్ణానదికి వరద ఉధృతి పెరిగింది. గత కొన్ని రోజులుగా కృష్ణానదికి సుమారు రెండు లక్షల క్యూసెక్కుల నీరు రావటంతో నదీ తీర గ్రామాలన్నీ అప్రమత్తమయ్యాయి. ఈ నేపథ్యంలో మత్స్యకారుల వేట పూర్తిగా స్తంభించి పోయింది. తీర గ్రామాల్లోని మత్స్య కారులు వారి పడవలను ఒడ్డుకు చేర్చుకొని నిత్యం కాపలా కాస్తు న్నారు. వరద ఉధృతి రాబోయే రోజుల్లో మరింత పెరిగే అవకాశం ఉంది. నదీ తీర గ్రామాలు ప్రతి నిత్యం అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరుతున్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : పులి చింతల ప్రాజెక్టులో సోమవారం 38.17 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 2,31,641 క్యూసె క్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుంది. ప్రాజెక్టు వద్ద పవర్ జనరేషన్ ద్వారా 16వేల క్యూసెక్కుల నీరు, లీకుల ద్వారా నాలుగు వందల క్యూసె క్కులు, తొమ్మిది గేట్ల ద్వారా 2,64,807 క్యూసె క్కులు, మొత్తం 2,81,807 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుంది.



ఒడ్డుకు చేరిన మత్స్యకారుల పడవలు



అరవింద వారధి వద్ద పెరిగిన వరద ప్రవాహం

కొల్లూరు ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కృష్ణా నదికి మళ్లీ వరద ప్రవాహం పెరిగింది. దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు. అల్ప పీడన ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాల వల్ల.. కృష్ణానది పరీవాహక ఎగువ ప్రాంతం నుంచి భారీ వరద నీరు కృష్ణా నదికి చేరుతోంది. ఈ నేపథ్యంలో బాపట్ల జిల్లా కలెక్టర్ వెంకటమురళి ఆదివారమే అధికారులను అప్రమత్తం చేశారు. సోమవారం రెవెన్యూ కార్యాలయాల్లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికను కూడా రద్దు చేసి వరదల పట్ల అప్రమత్తం కావాలని, వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

మార్జిన్‌లోకి దూసుకెళ్లిన కారు

ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి ప్రమాదం



మార్జిన్‌లోకి దూసుకు వెళ్లిన కారును బయటకు నెడుతున్న యువకులు

బల్లికురవ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కొమ్మాలపాడు రోడ్డులో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయిన కారు వేగంగా మార్జిన్‌ల ఉన్న పొలాల్లోకి దూసుకు వెళ్లింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదు. కొమ్మాలపాడు నుంచి బల్లికురవ వస్తున్న కారు చెన్నుపల్లి సమీపంలోకి వచ్చే సరికి ఎదురుగా వస్తున్న వాహనం పైకి రావటంతో వెంటనే రోడ్డు పక్కన ఉన్న పొలాల్లోకి డ్రైవర్ పోనివ్వటంతో త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. ప్రమాదం జరిగిన సమయంలో కారులో ముగ్గురు ఉన్నారు. వారు సుక్షితంగా బయటపడ్డారు. వెంటనేయువకులు కారును బయటకు తీశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

- గుంటూరులో వైద్యం అందిస్తున్న కుటుంబ సభ్యులు

వాకావారిపాలెం(చీరాల), ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : వాడరేవు సమీపంలోని వాకావారి పాలెంకు చెందిన యొహాను రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ఆదివారం రాత్రి ఇంటి నుండి బయటకు వెళ్లిన బాధితుడు తీవ్ర రక్త గాయాలతో 167 ఏ జాతీయ రహదారిలో పడి ఉన్నాడు. అర్ధరాత్రి గ్రహించిన గ్రామస్థులు కుటుంబ సభ్యులకు సమాచారం చేర వేశారు. వెంటనే చీరాల్లోని ఓ ప్రయివేట్ వైద్యశాలకు తరలించి ప్రాథమిక చికిత్స అందించి పరిస్థితి విషమంగా ఉండటంతో గుంటూరుకు తరలించి చికిత్స అందిస్తున్నారు. అయితే ప్రమాదం ఎలా జరిగిందో ఎవ్వరికీ తెలియని పరిస్థితి నెలకొంది.

వైట్, బ్లాక్ బర్లీ పొగాకు సాగు నిషేధం

చినగంజాం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి) : మండలంలో వైట్, బ్లాక్ బర్లీ పొగాకు సాగును నిషేధించినట్లు మండల వ్యవసాయాధికారి ఆర్.చంద్రశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోనే వైట్, బ్లాక్ బర్లీ పొగాకు పంటను నిషేధిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. పొగాకు పంటను నిషేధించినందున రైతులందరూ ప్రత్యామ్నాయ పంటలు మొక్కజొన్న, జొన్న పంటలతో పాటు ఇతర పంటలను సాగు చేసుకోవాలని సూచించారు. ఇతర జిల్లాల నుంచి పొగాకు నారు తెచ్చి సాగు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రైవేటు కంపెనీల అగ్రిమెంట్లు, ప్రలోభాలను నమ్మవద్దని తెలిపారు. జిల్లాలో అధిక వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు తమ పంటను కాపాడుకోవాలని సూచించారు. మండలంలోని రైతులకు సరిపడా ఎరువులు అందుబాటులో ఉన్నాయని, ఎవరూ ఎరువుల గురించి ఆందోళన చెందొద్దని, రైతు సేవా కేంద్రాల వద్ద కూడా మీరు కోరిన ఎరువులు అందుబాటులో ఉంచుతామని ఏవో తెలిపారు.

పరిశుభ్రమైన వాతావరణం ఉండాలి

యద్దనపూడి/మార్టూరు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి) : యద్దనపూడి గురుకుల బాలికల విద్యాలయాన్ని సోమవారం ఎంపీడీవో జావెద్ పరిశీలించారు. బాలికలకు పరిశుభ్రమైన వాతావరణం ఉండాలని, అధికారులకు సూచించారు. మురికి కుంటలు ఉండరాదని, మురుగునీరు నిల్వ లేకుండా చూడాలని చెప్పారు.

పీ-4.. పితలాటకం!

(5వ పేజీ తరువాయి)

తొలి విడతలో దత్తత తీసుకునేలా నిర్ణయించారు. ఇందులో 27,760 కుటుంబాలను దత్తతకు 4,202 మంది మార్గదర్శకులను గుర్తించినట్లు అధికారులు తెలిపారు.

- బాపట్ల జిల్లాలో 57,388 బంగారు కుటుంబాలను గుర్తించారు. 1,44,569 మంది కుటుంబ సభ్యులున్నారు. 49,151 బంగారు కుటుంబాల దత్తత ప్రక్రియ చేపట్టనున్నారు. వీటిలో 8,179 కుటుంబాల కు 4,212 మార్గదర్శకులను గుర్తించారు.
- గుంటూరు జిల్లాలో 1,00,314 బంగారు కుటుంబాలను గుర్తించగా వీటిలో 2,77,330 మంది కుటుంబ సభ్యులు ఉన్నారు. 83,764 కుటుంబాల దత్తతకు ఏర్పాటు చేస్తున్నారు. ముందుగా 16,550 కుటుంబాల దత్తత ప్రక్రియ ప్రారంభించాలని అధికార యంత్రాంగం నిర్ణయించింది. 4,281 మార్గదర్శకులను ఎంపిక చేశారు.

ఎమ్మెల్యే ఏలూరి కృషితో డీడీఎన్ఎస్ మంజూరు

ఉత్తర్వులు జారీచేసిన దేవదాయ శాఖ కమిషనర్

దేవాలయాల నిర్వహణకు నెలకు రూ.10వేలు



ఎమ్మెల్యే సాంబశివరావు

పర్చూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ వ్యాప్తంగా 11 దేవాలయాలకు ధూప దీప నైవేద్యం పథకం మంజూరు చేస్తూ సోమవారం దేవదాయ కమిషనర్ కె. రామచంద్ర మోహన్ ఉత్తర్వులు జారీచేశారు. శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు ప్రత్యేక కృషితో దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చొరవతో పలు దేవాలయాలకు ఈ పథకం వర్తించనుంది. ఆయా దేవాలయాలకు నెలకు రూ.10వేల చొప్పున ప్రభుత్వం నిధులు మంజూరు చేయనుంది. అందులో అర్చకుల వేతనం రూ.7వేలు, నైవేద్యానికి రూ.3వేలు వెచ్చించనున్నారు.

ఎంపికైన ఆలయాలు ఇవే...

మండలం తన్నీరువారిపాలెంలోని శ్రీ కోదండ రామాలయం, పోలేరమ్మ అమ్మవారి ఆలయం, నూతలపాడు శ్రీ పద్మాలంకమ్మ అమ్మవారు దేవస్థానం, కారంచేడు మండలం ఎర్రంవారిపాలెంలోని విజయ గణపతి స్వామి ఆలయం, మార్టూరు మండలం బొల్లాపల్లిలోని సీతారామ స్వామి దేవస్థానం, గోవిందాంబ సమేత బ్రహ్మేంద్ర స్వామి ఆలయం, ఇంకొల్లు మండలం వంకాయలపాడు పోలేరమ్మ దేవస్థానం, సిద్ధి వినాయక ఆలయం, శ్రీపుట్టల కామేశ్వరి అమ్మవారి ఆలయం, సుబ్బారెడ్డిపాలెంలో కోదండరామ స్వామి ఆలయానికి ఆ పథకం వర్తించనుంది.

కొలువుల ఎర.. నిరుద్యోగులు విలవిల

(5వ పేజీ తరువాయి)

అక్కడ ఉన్న ఒక వ్యక్తిని కలిశారు. అతని సూచన మేరకు గుంటూరులోని ఓ వ్యక్తి దగ్గరకు వారు వచ్చారు. గుంటూరు కలెక్టర్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం ఇప్పిస్తానని చిరంజీవి వద్ద రూ. 2 లక్షలు, పూర్ణ వద్ద రూ. 1.70 లక్షలు అతను తీసుకున్నాడు. ఇదంతా ఈ ఏడాది ఏప్రిల్, మే నెలల్లో జరిగింది. ఫోన్ పే ద్వారా నగదును బదిలీ చేశారు. గుంటూరు వ్యక్తి నగదు బదిలీ సమయంలోనే జాగ్రత్త వహించాడు. ఆ సొమ్మును బంగారం వ్యాపారికి బదిలీ చేయించాడు. కొంత మాత్రం తన ఖాతాతోపాటు, వాళ్ల సోదరి అకౌంట్‌కు బదిలీ చేయించుకున్నారు. నగదు తీసుకునే సమయంలో పది రోజుల్లోనే నియామకపు ఉత్తర్వులు ఇప్పిస్తామని హామీ ఇచ్చారు.

నకిలీ నియామక ఉత్తర్వులు

నిరుద్యోగులను నమ్మించడం కోసం ఈ ముఠా నకిలీ నియామక ఉత్తర్వులను తయారు చేసింది. అందులో గుంటూరు జాయింట్ కలెక్టర్ పేరు నిరుద్యోగులకు చూపించారు. అయితే జేసీ సంతకం దగ్గర మహిళా అధికారి పేరు ఉండడంతో.. అనుమానం వచ్చిన బాధితుడు ఇదేమిటి అని అడగగా.. మరొకరు కూడా అదే పోస్టులో ఉన్నట్లు నమ్మించే ప్రయత్నం చేశారు. పది రోజుల్లో చిరునామాకు నియామకపు ఉత్తర్వులు వస్తాయని చెప్పినట్లు బాధితులు చెబుతున్నారు. ఏ విధమైన ఉత్తర్వులు రాకపోవడంతో బాధితులు గుంటూరుకు చెందిన వ్యక్తికి ఫోన్ కాల్ చేయగా స్పందన లేదు. మోసపోయమని తెలుసుకున్న బాధితులు న్యాయం కోసం జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు.

వర్సిటీలో పరీక్ష కూడా పెట్టారు..

ఉద్యోగాల పేరుతో గుంటూరుకు చెందిన వ్యక్తి చాలా మందిని మోసం చేసినట్లు తెలుస్తోంది. మరొక మహిళ కూడా అదే వ్యక్తిపై ఈ మధ్య కాలంలో జిల్లా కలెక్టర్‌కు, ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఎన్‌జీ రంగా వర్సిటీలో కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగం ఇప్పిస్తానని ఆమెను ఏకంగా యూనివర్సిటీకి తీసుకెళ్లారు. కంప్యూటర్ పరీక్ష కూడా నిర్వహించినట్లు బాధితురాలు చెబుతోంది. దీంతో ఉద్యోగం సంగతి వాస్తవమేనని నమ్మి.. నగదు ముట్టజెప్పినట్లు తెలుస్తోంది. ఈ ముఠా గుంటూరు, ఒంగోలు, విశాఖపట్నం జిల్లాల్లో ఇటువంటి మోసాలకు పాల్పడినట్లు సమాచారం.

ఆరేళ్ల తర్వాత ఊరట

ఉపాధి పెండింగ్ బిల్లుల మంజూరుకు చర్యలు

నాటి టీడీపీ హయాంలో పెద్దఎత్తున పనులు

చెల్లింపులను నిలిపివేసిన వైసీపీ ప్రభుత్వం

భారీగా బకాయిలతో అవస్థలు పడ్డ శ్రేణులు

ప్రస్తుతం వాటి చెల్లింపులకు చర్యలు

ఆరు మాసాల క్రితం రూ.11 కోట్లు జమ

తాజాగా మరో రూ.16.17 కోట్లు చెల్లింపునకు చర్యలు

ఆధారాలతో అప్‌లోడ్ చేస్తున్న అధికారులు

నమోదు చేయకుండా నిలిపివేసిన వాటిపైనా దృష్టి

నియోజకవర్గాల వారీ సమావేశాలు

ఒంగోలు ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ ప్రభుత్వం (2014-19)లో ఉపాధి హామీ పథకం పనుల బిల్లులకు ఇప్పుడు మోక్షం లభిస్తోంది. ఉపాధి పథకం మెటీరియల్ కోటా నిధుల ద్వారా అప్పట్లో పెద్దఎత్తున పనులు చేపట్టారు. గ్రామీణ ప్రాంతాల్లో సీసీరోడ్లు, డ్రైన్లు, శ్మశానాల అభివృద్ధి, పాఠశాలలకు ప్రహరీలు, మొక్కల పెంపకం, చెత్త నుంచి సంపద తయారీ (డబ్ల్యూపీసీ) కేంద్రాలు, అంగన్‌వాడీ, పంచాయతీ భవన నిర్మాణాలు భారీగా చేపట్టారు. జిల్లాలో సుమారు రూ.వెయ్యి కోట్ల పనులు నాటి టీడీపీ ప్రభుత్వంలో జరిగాయి.

బిల్లులు చెల్లించకుండా వేధించిన వైసీపీ ప్రభుత్వం

2019 ఎన్నికలకు ముందు చేసిన పనులకు సంబంధించిన బిల్లులను వైసీపీ ప్రభుత్వం నిలిపివేసింది. అలా రూ.100 కోట్ల వరకు బిల్లులు ఆగిపోయాయి. వీటిలో అత్యధిక భాగం టీడీపీ శ్రేణులు చేసి ఉండటంతో వారిని ఆర్థికంగా దెబ్బతీసేందుకు వైసీపీ ప్రభుత్వం అలా వ్యవహరించింది. కొంతకాలం తర్వాత పనులు చేసిన పలువురు కోర్టును ఆశ్రయించారు. దీంతో వైసీపీ ప్రభుత్వం విజిలెన్స్, ఇతర శాఖల ఇంజనీరింగ్ సిబ్బందితో తనిఖీలు చేయించింది. పూర్తిచేసిన పనుల్లో భారీగా బిల్లులు తగ్గించి వేధింపులకు గురిచేసింది. ఎక్కువమంది కోర్టుకు వెళ్లలేక, వేధింపులను తట్టుకోలేక బిల్లులు అడగడం మానేశారు. చివరకు కోర్టు ఆదేశాలతో కొందరికి చెల్లించిన నాటి వైసీపీ ప్రభుత్వం భారీగా బిల్లులను అసలు ప్రభుత్వ రికార్డుల్లో (ఆన్‌లైన్‌లో) నమోదు కూడా కాకుండా వర్క్ క్లోజర్ డేటా కింద చూపింది. దీంతో కేంద్రానికి రాష్ట్రప్రభుత్వం నివేదించే బిల్లుల జాబితాలో అసలు ఆ పనులు నమోదు కాకుండా నిలిచిపోయాయి. వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లు బిల్లులు రాకపోవడంతో పనులు చేసిన టీడీపీ శ్రేణులు తీవ్రంగా నష్టపోయారు.

కేంద్ర వెబ్‌సైట్‌ను తిరిగి తెరిపించిన మంత్రి పెమ్మసాని

తిరిగి అధికారంలోకి వచ్చిన ప్రజా ప్రభుత్వం దృష్టికి ఉపాధి పథకం బిల్లుల వ్యవహారం వచ్చింది. తొలివిడత అన్ని రికార్డుల్లో నమోదై వివరాలు సక్రమంగా ఉన్న పనులకు చెల్లింపులు చేసింది. అలా ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరిలలో జిల్లాలో రూ.11కోట్ల పెండింగ్ బిల్లులు జ వ ం య్యాయి. రెండో దశలో పనులు చేసినట్లు రికార్డుల్లో ఉన్న వాటిపై దృష్టి సారించారు. వైసీపీ ప్రభుత్వ కాలంలో వర్క్ క్లోజర్ కింద చూపడంతో అలాంటి పనులను తిరిగి ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు కేంద్రం అనుమతి అవసరమై జాప్యం నెలకొంది. దీనిపై సీఎం ఆదేశాలతో రాష్ట్రానికి చెందిన కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చొరవ చూపడంతో కేంద్రం నిలిపివేసిన ఆన్‌లైన్ వెబ్‌సైట్‌ను ఇటీవల తిరిగి ఓపెన్ చేసింది. దీంతో ప్రస్తుతం ఆ వివరాలను అధికారులు నమోదు చేస్తున్నారు. జిల్లాలో చిన్నాపెద్దవి కలిపి సుమారు రూ.16.17 కోట్లకు సంబంధించిన 19,393 పనులు ఉన్నట్లు గుర్తించారు. వాటిని ప్రస్తుతం నమోదు చేస్తుండగా నగదు జమవుతున్నదని సమాచారం.



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు(ఫైల్)

ఆధారాలు ఉంటే చెల్లింపు!

ఇక వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అప్పటికి టీడీపీ శ్రేణులు చేసిన పనుల్లో పూర్తయిన వాటికి చెల్లింపులు నిలిపివేయడమే కాక అసలు ఆన్‌లైన్‌లో నమోదు చేయడం, ఎంబుక్‌లో రికార్డు చేయడం వంటివి కూడా ఆపివేసినవి భారీగా ఉన్నాయి. అలాంటి వాటికి కూడా ఆధారాలు ఉంటే తిరిగి నమోదు ప్రక్రియ పూర్తిచేసి చెల్లింపులకు చర్యలు తీసుకోవాలని సీఎం కార్యాలయం నుంచి అధికారులకు ఆదేశాలు అందాయి. దీంతో అలాంటి వాటిని గుర్తింపుపై ప్రస్తుతం డ్వామా అధికారులు కసరత్తు చేస్తున్నారు.

డ్వామా అధికారుల సమావేశాలు

మూడు రోజులుగా జిల్లాలో నియోజకవర్గాల వారీ ప్రజాప్రతినిధుల సమక్షంలో డ్వామా అధికారులు ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నారు. పనులు చేయించడంలో కీలకమైన డ్వామా సిబ్బంది, ఎంపీడీవోలు, ఇంజనీరింగ్ సిబ్బందితో సంయుక్తంగా ఈ సమావేశాలను నిర్వహించి అప్పట్లో పనులు చేసిన వారిని కూడా పిలిపిస్తున్నారు. వారి వద్ద ఉన్న ఆదారాలను పరిశీలిస్తున్నారు. ఈ తరహవి కూడా భారీగానే ఉన్నట్లు తెలుస్తోంది. కొద్దిపాటి ఆధారాలున్నా అలాంటి వాటిని నమోదు చేసి బిల్లులు అందేలా చర్యలు తీసుకొనే ఆలోచనలో అధికారులు ఉన్నారు. ఈక్రమంలో గత గురువారం కొండపి నియోజకవర్గ సమావేశం తూర్పునాయుడుపాలెంలో మంత్రి డాక్టర్ స్వామి క్యాంపు కార్యాలయంలో జరిగింది. డ్వామా పీడీ జోసఫ్‌కుమార్‌తోపాటు సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పనులు చేసి వైసీపీ ప్రభుత్వ కక్షసాధింపు చర్యతో ఆ బిల్లులు అందక ఆర్థికంగా నష్టపోయిన వారికి ఊరట కలిగించేలా ప్రజా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అలాంటివి జిల్లాలో రూ.60నుంచి 70 కోట్ల వరకు ఉన్నట్లు అంచనా. అందులో చెల్లించకుండా ఆగిపోయినట్లు అధికారిక లెక్కల్లో చూపిన రూ.11కోట్లను ఆరు మాసాల క్రితం ప్రభుత్వం చెల్లించింది. నమోదు కాకపోయినా పనులు పూర్తి చేసినట్లు అధికారుల వద్ద రికార్డుల్లో ఆధారాలు ఉన్న వాటికి రూ.16.17 కోట్లను ప్రస్తుతం విడుదల చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. మరో రూ.30కోట్లకు పైగా అసలు లెక్కాపత్రం లేకుండా నాటి వైసీపీ ప్రభుత్వం ఇబ్బందిపెట్టినవి ఉన్నట్లు అంచనా వేశారు. వాటికి అవసరమైన ఆధారాల సేకరణపై దృష్టిసారించారు. ప్రభుత్వ ఆదేశాలతో డ్వామా జిల్లా అధికారులు నియోజకవర్గాల వారీ కీలక సమావేశాలను ప్రజాప్రతినిధుల సమక్షంలో నిర్వహిస్తున్నారు.

అర్ధరాత్రి వరకు తాగుడే!

జిల్లాలో 29 బార్లకు నోటిఫికేషన్

గీత కార్మికులకు 3 కేటాయింపు

లాటరీ ద్వారా ఎంపిక

ఒంగోలు క్రైం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ నూతన విధానంలో 2025-28కి జిల్లాలో 29 బార్ల ఏర్పాటుకు నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. వీటిలో మూడు బార్లు గీత కార్మికులకు కేటాయించారు. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు బార్లు నిర్వహించుకోవచ్చు. ఈ మేరకు స్థానిక జిల్లా ఎక్సైజ్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్(డీసీ) హేమంత్ నాగరాజు, జిల్లా ఎక్సైజ్ అధికారి(ఈఎస్) ఎస్.ఆయేషాబేగంలు నిర్వహించిన మీడియా సమావేశంలో నూతన బార్లకు నోటిఫికేషన్ విడుదల చేశారు. మొత్తం జిల్లాలో 29 బార్లు కాగా వీటిలో 3 గీత కార్మికులకు కేటాయించినట్లు తెలిపారు. 26 బార్లలో ఒంగోలులో 16 కేటాయించగా, మార్కాపురం 5 బార్లకు రూ.55లక్షలు లైసెన్స్ ఫీజుగా నిర్ణయించారు. పొదిలి, కనిగిరి, దర్శి, చీమకుర్తి, గిద్దలూరులలో ఒక్కో బార్‌ను కేటాయించారు. ఆ ప్రాంతాల్లో రూ.35 లక్షలు లైసెన్స్ ఫీజుగా నిర్ణయించారు. ఈనెల 18 నుంచి 26 వరకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్, హైబ్రిడ్ ద్వారా దరఖాస్తులు చేసుకోవచ్చు అన్నారు. 28న ఒంగోలు అంబేడ్కర్ భవన్‌లో కలెక్టర్ సమక్షంలో లాటరీ పద్ధతిన బార్ల కేటాయిస్తామన్నారు. అప్లికేషన్ ధర రూ.5లక్షలుగా నిర్ణయించారని ఆ ఫీజు తిరిగి ఇస్తారన్నారు. దరఖాస్తుదారుడు ప్రాసెసింగ్ ఫీజు రూ.10వేలు అని తెలిపారు. ఒక్కో బార్‌కు తప్పనిసరిగా 4 దరఖాస్తులు వస్తేనే లాటరీ వేస్తామన్నారు.

గీత కార్మికులకు సగం ధరకే బార్ కేటాయింపు

గీత కార్మికులకు లైసెన్స్ ఫీజులో 50శాతం రాయితీ ఇస్తారన్నారు. మూడు బార్‌లు కేటాయించినట్లు తెలిపారు. ఒంగోలులో ఒక బార్ గౌడ్‌కు, మార్కాపురంలో ఒక బార్ గౌడా, మరొక బార్ గౌండ్లకు కేటాయించారు. వీరు అప్లికేషన్లు ఈనెల 20 నుంచి 29 వరకు జిల్లా ఎక్సైజ్ కార్యాలయంలో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్, హైబ్రీడ్ మోడ్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వీరికి కేటాయించే బార్‌లకు లైసెన్స్ ఫీజు ఒంగోలు మార్కాపురంలలో రూ.27.50 లక్షలు ఉంటుందని తెలిపారు. ఈనెల 30న దరఖాస్తులు పరిశీలించి లాటరీ తీసి కేటాయింపు చేస్తారన్నారు.

కళా ఉత్సవ్‌లో అలరించిన నవోదయ విద్యార్థులు

తర్లుపాడు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కలుజువ్వలపాడు గ్రామ పరిధిలో జవహర్ నవోదయ విద్యాలయంలో సోమవారం నుంచి కళా ఉత్సవ్ కార్యక్రమం ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ బ్రహ్మానందరెడ్డి తెలిపారు. రెండు రోజులపాటు జరిగే కళా ఉత్సవ్‌లో హైదరాబాద్ రీజియన్‌లోని ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన 19 నవోదయ పాఠశాలల విద్యార్థులు పాల్గొంటున్నట్లు తెలిపారు. విద్యార్థులు ప్రత్యేక వేషధారణ, నృత్యాలతో ఆకట్టుకున్నారని చెప్పారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న మార్కాపురం మున్సిపల్ కమిషనర్ డీవీఎస్ నారాయణ మాట్లాడుతూ విద్యార్థులు ప్రకృతిని కాపాడుకుంటూ స్వచ్ఛాంధ్రలో భాగస్వాములు కావాలని తెలిపారు. విద్యతోపాటు కళలపై కూడా ఆసక్తి ఉండాలన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న కళను వెలికితీసేందుకు ప్రభుత్వం ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సాధన కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.మధుసూదన్‌శర్మ, గుంటూరు ప్రభుత్వ మ్యూజిక్ స్కూల్ అధ్యాపకులు, న్యాయ నిర్ణేతలు సురేష్ బాబు, ప్రభాకర్‌రావు, జయశంకర్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీధర్, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

అవీఇవీ

ఆధునిక వ్యవసాయ యాంత్రీకరణతో అధిక ఆదాయం



మాట్లాడుతున్న ఏడీఏ ఎఫ్రాయిమ్

అద్దంకిటౌన్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఆధునిక వ్యవసాయ యాంత్రీకరణతోనే అధిక ఆదాయం పొందవచ్చని అద్దంకి సహాయ వ్యవసాయ సహాయకులు బి.ఎఫ్రాయిమ్ చెప్పారు. సోమవారం మండలంలోని బొమ్మనంపాడు రైతు సేవా కేంద్రం వద్ద ఆత్మ సౌజన్యంతో డ్రోన్ టెక్నాలజీపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ ఆధునిక వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా మందుల పిచికారీలో కిసాన్ డ్రోన్‌లు విప్లవాత్మక పాత్ర పోషిస్తున్నాయన్నారు. ఏవో కొర్రపాటి వెంకటకృష్ణ మాట్లడుతూ మండలంలో 5 కిసాన్ డ్రోన్‌లు 39.20 లక్షల రాయితీపై అందించినట్లు తెలిపారు. డ్రోగో కంపెనీ ప్రతినిధి లీ లాకుమార్ డ్రోన్ పని చేసే విధానాలను రైతులకు వివరించారు. ఆత్మ బ్లాక్ టెక్నాలజి మేనేజర్ శేషారావు, నాగులపాడు సొసైటి అధ్యక్షుడు ఏనుగంటి వెంకటరామయ్య, కామేపల్లి హనుమంతరావు, ఆత్మ ఏటీఎం రామిరెడ్డి, ఏఈవో కోటేశ్వరరావు వీఏఏ దినేష్ సాయి పాల్గొన్నారు.

ఎన్ని బార్లకైనా దరఖాస్తు చేసుకోవచ్చు..

(5వ పేజీ తరువాయి)

చెల్లించాలన్నారు. దరఖాస్తుదారుడికి వయసు కనీసం 21 ఏళ్లు ఉండాలి అన్నారు. జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి అరుణకుమారి, సీఐ లత పాల్గొన్నారు.

గౌడ కార్మికులకు 15 బార్లు

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో గౌడ, గౌడ సంఘీలకు మొత్తం 15 షాపులు కేటాయించడం జరిగిందని గుంటూరు ఎక్సైజ్ శాఖ డీసీ శ్రీనివాసులు తెలిపారు. గుంటూరు కలెక్టరేట్‌లో జిల్లా జేసీ భార్గవ్ తేజ, పల్నాడు కలెక్టరేట్లో అధికారులు గౌడ సామాజిక వర్గాలకు సంబంధించిన ప్రాంతాలను ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. గుంటూరులో 10 బార్లను కేటాయించగా.. గౌడకు 7, గౌడ్‌కు ముడు షాపులు కేటాయించామన్నారు. పల్నాడు జిల్లాలో కేటాయించిన 5 షాపుల్లో గౌడకు 3, గౌడ్‌కు 2 షాపులు నిర్ణయించినట్లు వెల్లడించారు. ఈ సామాజిక వర్గాలకు బార్ లైసెన్సు ఫీజు రూ.27.50 లక్షలుగా నిర్ణయించారు. సాధారణ బార్లకు ఏడాదికి లైసెన్సు ఫీజు రూ.55 లక్షలుగా ఉంది. ఏటా లైసెన్సు ఫీజును పెంచనున్నారు. రెండో ఏడాది రూ 60.50 లక్షలు, మూడవ ఏడాది రూ.66.55 లక్షలుగా లైసెన్సు ఫీజును ప్రభుత్వం నిర్ణయించింది. పల్నాడు జిల్లాలో బార్ లైసెన్సులకు బుధవారం కలెక్టర్ పి.అరుణ్‌బాబు గెజిట్ విడుదల చేయనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లపై ఆయన కలెక్టరేట్‌లో ఎక్సైజ్ అధికారులతో సమీక్షించారు. ఈ నెల 29 సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తు చేసుకోవాలని, 30న బార్లకు లాటరీ తీయనున్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించాలి



ప్రకృతి కషాయాల తయారీని పరిశీలిస్తున్న డీపీఎం మోహన్

బల్లికురవ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి పద్ధతి ద్వారా చేపట్టే వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించాలని డీపీఎం మెహన్ చెప్పారు. సోమవారం మండలంలోని నక్కబొక్కలపాడు గ్రామంలో ప్రకృతి పద్ధతిలో తయారు చేస్తున్న కషాయాలను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అవసరమైన కషాయాలను అందుబాటులో ఉంచాలన్నారు. అలానే తక్కువ ఖర్చుతో పురుగు మందుల స్థానంలో కషాయాలను తయారు చేసుకొనేలా రైతులను సిద్ధం చేయాలని చెప్పారు. వంటింట్లో దొరికే వస్తువులతో తెగుళ్ల నివారణకు మందులను తయారు చేసుకోవచ్చన్నారు. అనంతరం అజ్ఞాస్త్రం, వెల్లుల్లి కషాయం తయారీ చేసి రైతులకు చూపించారు. ఈ కార్యక్రమంలో ఎంటీ అప్పారావు, యూనిట్ ఇన్‌చార్జి సీహెచ్ కల్పన పాల్గొన్నారు.

స్త్రీ శక్తి పథకంతో మహిళలకు మేలు



చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మండల సమాఖ్య సభ్యులు, టీడీపీ నేతలు

చినగంజాం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి) : స్త్రీశక్తి పథకంతో మహిళలకు మేలు చేకూరుతుందని టీడీపీ మండల అధ్యక్షుడు పొద వీరయ్య, మండల సమాఖ్య అధ్యక్షురాలు కావూరి శారదలు చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించినందుకు వెలుగు డీఆర్డీఏ ఆధ్వర్యంలో స్థానిక పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహం వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చిత్రపటానికి మండల సమాఖ్య సభ్యులు సోమవారం క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో చినగంజాం గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్‌లు రాయని ఆత్మారావు, చెరుకూరి రాఘవయ్య, టీడీపీ నాయకులు సందు శ్రీనివాసరావు, బెల్లంకొండ రమేష్‌బాబు, నరహరి శ్రీనివాసరావు, గుండ్రెడ్డి నరసింహారావు, పల్లపోలు శ్రీనివాసరావు, టీ.చిన్నా, ఏపీఎం గద్దె పెదసుబ్బారావు, సీసీలు కే వెంకటస్వామి, మాధవి, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

రైలు పట్టాలపై వ్యక్తి మృతదేహం

● మృతుడు ఒంగోలు వాసిగా గుర్తింపు



రాంకుమార్ (ఫైల్)

చీరాల, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): బిట్రగుంట, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): బిట్రగుంట రైల్వేసెక్షన్ పరిధిలోని తలమంచి-కొడవలూరు రైల్వేస్టేషన్ల మధ్య ఎగువ మార్గంలో సుమారు(54) ఏళ్ల వ్యక్తి మృతదేహాన్ని సోమవారం జీఆర్పీ పోలీసులు గుర్తించారు. అతని వద్ద లభించిన సెల్‌ఫోన్ ఆధారంగా విచారించగా ఒంగోలుకు చెందిన నక్కా రాంకుమార్‌గా గుర్తించారు. ఆయన బోగోలు మండలం కోవూరుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెల్త్ అసిస్టెంట్ (విలేజ్ హెల్త్ క్లీనిక్, విశ్వనాథరావుపేట1)లో పనిచేస్తున్నట్లు బంధువుల సమాచారంతో నిర్ధారించారు. విధులకు హాజరయ్యేందుకు వెళుతూ ప్రమాదవశాత్తు రైల్లో నుంచి జారిపడి మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. రైల్లో నుంచి పడటం వలన మృతదేహం గుర్తుపట్టలేని రీతిలో ఉంది. రాంకుమార్‌కు భార్య ప్రసన్న, కుమార్తె, కుమారుడు ఉన్నారు.ఈ మేరకు జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఒకచోట కళకళ.. మరోచోట విలవిల

ముంపు గ్రామమైన ధేనువకొండకు శాపం.. ఉమ్మనేనివారిపాలెంకు వరం...

గుండ్లకమ్మ ప్రాజెక్ట్ ముంపు గ్రామం కావడంతో మౌలిక వసతుల కల్పనకు అడ్డంకిగా నిబంధనలు

ధేనువకొండ పంచాయతీ పరిధిలోని ఉమ్మనేనివారిపాలేనికి దండిగా నిధులు ఖర్చు

సమస్యలతో విలవిల్లాడుతున్న నిర్వాసితులు

పునరావాస కాలనీలకు కొద్ది మందే తరలి వెళ్లిన వైనం



ఉమ్మనేనివారిపాలెంలో వేసిన అంతర్గత సీసీ రోడ్డు



తుమ్మ చెట్లతో మూసుకుపోయిన ధేనువకొండ రోడ్డు

అద్దంకి, ఆగస్టు18 (ఆంధ్రజ్యోతి) : ధేనువకొండ.. అద్దంకి మండలంలో అతి పెద్ద గ్రామం. ఆ గ్రామం పరిస్థితి ముందు నుయ్యి.. వెనక గొయ్యి అన్న చందంగా మారింది. ఆ గ్రామంలో గత 15 ఏళ్లుగా కనీస మౌలిక వసతుల కల్పన కూడా చేయలేని దుస్థితి. ఆ వివరాలేంటో చూద్దాం... గుండ్లకమ్మ రిజర్వాయర్ నిర్మాణంలో ధేనువకొండ ముంపు గ్రామంగా ఉండటంతో మౌలిక వసతుల కల్పనకు నిబంధనలు పెద్ద సమస్యగా మారాయి. ముంపు గ్రామమైనప్పటికీ పంట భూములు చాలా వరకు ముంపునకు గురికాలేదు. జీవనాధారమైన భూములను నమ్ముకునే వ్యవసాయం చేస్తున్నారు. గ్రామానికి సుమారు 25 కి.మీ దూరంలో మూడు పునరావాస కాలనీలను ప్రభుత్వం నిర్మించినా అక్కడకు రైతులు వెళ్లేందుకు ఇష్టపడటం లేదు.

దక్షిణ ధేనువకొండ పునరావాస కాలనీలోనూ సమస్యలు

ఇంకొందరికి సమీపంలోని దక్షిణ ధేనువకొండ వద్ద పునరావాస కాలనీ ఏర్పాటు చేసినా కొద్దిమందికి మాత్రమే స్థలాలు కేటాయించారు. ఇంకా మౌలిక వసతుల కల్పన జరగలేదు. దీంతో ఆ పునరావాసకాలనీలో కూడా ఇళ్ల నిర్మాణం జరగలేదు. ముంపు గ్రామం పరిధిలో మొత్తం 4 వేల మంది జనాభా ఉండగా సుమారు వెయ్యి మంది మాత్రం అద్దంకి పట్టణానికి సమీపంలో ఉన్న రెండు పునరావాస కాలనీలకు వెళ్లారు.మిగిలిన మూడు వేల మంది జనాభా ధేనువకొండలోనే నివాసం ఉంటున్నారు.

ప్రస్తుతం ఉన్న గ్రామానికి సమీపంలో దక్షిణ ధేనువకొండ పునరావాస కాలనీ ఉండటం, భవిష్యత్‌లో ఆ ప్రాంతంలోనే ఎక్కువ మంది రైతులు నివాసాలు ఏర్పాటు చేసుకునే అవకాశం ఉండటంతో ఆ నిధులతో కనీసం పేరాయపాలెం నుంచి ధేనువకొండకు, ఉమ్మనేనివారిపాలెం నుండి ధేనువకొండలకు గ్రావెల్ లేదా తారు రోడ్లు నిర్మాణం చేసుకునే అవకాశం ఉంది.

మురుగుతో విలవిల

గ్రామంలో కనీసం సైడ్ డ్రైన్‌లు లేకపోవటం, మురుగు ఎక్కడికక్కడే నిలిచి ఉండటంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. కనీసం పారిశుధ్య పనులు, బ్లీచింగ్ చల్లటం లాంటి పనులైనా చేయాలని కోరుతున్నారు. అయినప్పటికి నేతలు, అధికారులు అటు వైపు దృష్టి సారించకుండా మిన్నకుండటం విమర్శలకు తావిస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ధేనువకొండ పంచాయతీలో మూలుగుతున్న నిధులను అభివృద్ధి పనులకు వెచ్చించేలా చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు. ముంపు గ్రామంగా ఉండటం ధేనువకొండకు శాపం కాగా అదే పంచాయతీలో ఉన్న అతి చిన్న గ్రామమైన ఉమ్మనేనివారిపాలేనికి మాత్రం వరంగా మారిందని గ్రామస్థులు చెబుతున్నారు.



ఉమ్మనేనివారిపాలెంలో వేసిన ప్రధాన సీసీ రోడ్డు

మూలుగుతున్న కోటి రూపాయలు

గత 15ఏళ్లుగా ధేనువకొండ గ్రామ పంచాయతీకి వివిధ సందర్భాలలో 2 కోట్ల రూపాయల వరకు నిధులు మంజూరు కాగా, అందులో సుమారు కోటి రూపాయలతో ధేనువకొండ గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న ఉమ్మనేనివారిపాలెంలో వెచ్చించి సీసీ రోడ్లు వేశారు. నివాస గృహాలు లేని రోడ్లను సైతం సీసీ రోడ్లుగా మార్చారు. సుమారు 150 మంది జనాభా ఉన్న ఉమ్మనేనివారిపాలెంలో పెద్ద ఎత్తున సీసీ రోడ్ల నిర్మాణం జరిగింది. ఇంకా కోటి రూపాయల నిధులు పంచాయతీలో మూలుగుతున్నాయి.

సీజనల్ వ్యాధులపై దృష్టి సారించాలి

బాపట్ల జిల్లా డీఎంహెచ్‌వో విజయమ్మ

పర్చూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, వీటిపై ప్రత్యేక దృష్టిసారించాలని బాపట్ల జిల్లా డీఎంహెచ్‌వో విజయమ్మ చెప్పారు. సోమవారం కారంచేడు మండలం దగ్గుబాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. వైద్యులు అందుబాటులో ఉండాలన్నారు. చెత్తా చెదారం పారిశుధ్యం లోపిస్తున్న తరుణంలో జిల్లా వ్యాప్తంగా సాధారణ జ్వరాలతోపాటు, టైఫాయిడ్, డెంగ్యూ వంటి వ్యాధులు సోకే అవకాశం ఉందన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో శరత్, హెచ్‌ఎస్ సాయి ప్రియ, టి.సుధాకర్ పాల్గొన్నారు.

గ్రామాలలో పారిశుధ్య కార్యక్రమాలను చేపట్టాలి

బల్లికురవ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో రెండు రోజుల నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయని అధికారులు వెంటనే పారిశుధ్య కార్యక్రమాలను చేపట్టాలని ఇన్‌చార్జి ఎంపీడీవో పాండురంగస్వామి చెప్పారు. సోమవారం ఆయన మాట్లాడుతూ గ్రామాలలో దోమల సంచారం లేకుండా ముందస్తు జాగ్రత్తగా మురుగు నీరు లేకుండా చర్యలు చేపట్టాలని, అలానే సున్నం బ్లీచింగ్ చల్లించాలని చెప్పారు. కాలువల్లో వ్యర్థాలను తొలగించాలన్నారు.



సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీఎంహెచ్‌వో విజయమ్మ

రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు రావినూతల విద్యార్థులు

మేదరమెట్ల, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు రావినూతల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ నెల 17వ తేదీన యోగాసన అసోసియేషన్, ప్రకాశం జిల్లా ఆధ్వర్యంలో ఆంధ్రకేసరి కళాశాలలో నిర్వహించిన యోగా పోటీలలో సబ్ జూనియర్ విభాగంలో రావినూతల జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన విద్యార్థులు పి.అనుస్మిత, కే.శ్రీవల్లి, సీహెచ్ గీతాంజలి, పీ మౌనిష్, బీ జాహ్నవి ప్రథమ స్థానంలో నిలిచారు. సోమవారం పాఠశాలలో విద్యార్థులను, వ్యాయామ ఉపాధ్యాయురాలు కందే కళ్యాణిలను హెచ్‌ఎం రాఘవరెడ్డి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ బుజ్జి, ఉపాధ్యాయులు అభినందించారు. వీరు ఈ నెల 21వ తేదీన తాడేపల్లిగూడెంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని హెచ్‌ఎం తెలిపారు. ఈ సందర్భంగా విజేతలకు పాఠశాల పూర్వ విద్యార్థులు తమ్మన హనుమంతరావు, పల్లపోతు రామాంజనేయులు రెండు వేలు నగదు బహుమతులను అందజేశారు.



ప్రథమ స్థానం సాధించిన రావినూతల హైస్కూల్ విద్యార్థులు

రైతులకు మెరుగైన సేవలు అందించటమే లక్ష్యం

సహకార సంఘం చైర్మన్ పోపూరి శ్రీనివాసరావు

పర్చూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : రైతులకు అనునిత్యం అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించటమే లక్ష్యంగా కృషిచేస్తామని అడుసుమల్లి సహకార సంఘం(ఎల్‌ఎస్‌సీఎస్) చైర్మన్ పోపూరి శ్రీనివాసరావు చెప్పారు. సోమవారం పర్చూరు మండల పరిధిలోని అడుసుమల్లి లార్జ్ సైజ్ కో-ఆపరేటివ్ సొసైటీ చైర్మన్, డైరెక్టర్ల ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కారుమంచి కృష్ణ, మండలపార్టీ అధ్యక్షులు షేక్ షంషుద్దీన్, కొరిటాల సురేష్, టీడీపీ లీగల్ సెల్ ప్రతినిధి అడ్డగడ వేణు, మక్కెన శేఖర్‌బాబు పాల్గొన్నారు. నూతన పాలక మండలికి ఎల్‌ఎస్‌సీఎస్ (సీఈవో) దొప్పలపూడి రమాదేవి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చైర్మన్ మాట్లాడుతూ ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సారథ్యంలో సొసైటీ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అడ్డగడ్డ వెంకటేశ్వర్లు, కారుమంచి పాపారావు. సొసైటీ డైరెక్టర్లుగా మూకిరి సుబ్బయ్య, అన్నవరపు శ్రీనివాసరావు(వాసు) పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న సొసైటీ చైర్మన్, డైరెక్టర్లు

కనక నాగవరపమ్మ దేవస్థానం కమిటీ చైర్మన్‌గా ఆంజనేయులు

చినగంజాం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి) : వేటపాలెం మండలం రావూరిపేట గ్రామంలో వేంచేసి యున్న కనక నాగవరపమ్మ అమ్మవారి దేవస్థానం ధర్మకర్తల మండలి నూతన కమిటీ ప్రమాణ స్వీకారం సోమవారం ఘనంగా జరిగింది. నూతన ధర్మకర్తల మండలి చైర్మన్‌గా వలేటి ఆంజనేయులు, ధర్మకర్తలుగా గోవిందు సుబ్బారావు, గుత్తి వీరప్రసాదరావు, చప్పటి వెంకటరావు, ఆతిన రమేష్, యర్రా శివ నాగమల్లేశ్వరి, చుండి శ్రీలక్ష్మి, ద్రోణాదుల సుబ్బాయమ్మ, కంచర్ల భిక్షాలు ఎంపికచేసిన విషయం తెలిసిందే. కనక నాగవరపమ్మ దేవస్థాన ప్రాంగణంలో దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ వేణుగోపాల్‌రావు నియమితులైన నూతన ధర్మకర్తలతో ప్రమాణ స్వీకారం చేయించారు.

నూతనంగా ఎంపికైన ధర్మకర్తల మండలి చైర్మన్, సభ్యులను పలువురు అభినందించారు. కార్యక్రమంలో చీరాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కౌతవరపు జనార్దన్, జడ్పీటీసీ మాజీ సభ్యురాలు యార్లగడ్డ లక్ష్మి, టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షులు దేవతోటి సుందరయ్య, ఈవో పోతిన శ్రీనివాసరావులు పాల్గొన్నారు.



అమ్మవారి దేవస్థానం కమిటీ సభ్యులు

రూపురేఖలు మారుతున్న లంబాడీడొంక రోడ్డు



రోడ్డును చదును చేస్తున్న వాహనం

సంతమాగులూరు ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మక్కెనవారిపాలెంలోని లంబాడీ డొంక అభివృద్ధి పనులు శరవేగంగా పూర్తవుతున్నాయి. రూ.25 లక్షలతో చేపట్టిన ఈ నిర్మాణం పనులు సోమవారం నాటికి 50శాతానికి పైగా పూర్తయ్యాయి. సుమారు రెండున్నర కిలోమీటర్లు వరకు ఈ రోడ్ల నిర్మాణం చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. వర్షం సైతం లెక్కచేయకుండా పనులు చేస్తుండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. త్వరలో నిర్మాణం పూర్తిచేసి రైతులకు అందుబాటులో తీసుకొస్తామని అధికారులు తెలిపారు.

రేపు మేదరమెట్లలో విద్యుత్ వినియోగదారుల అదాలత్

అద్దంకి, ఆగస్టు18 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి డివిజన్ స్థాయి విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీ మేదరమెట్లలో విద్యుత్ వినియోగదారుల అదాలత్, అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఈఈ నల్లూరి మస్తాన్‌రావు తెలిపారు. మేదరమెట్లలోని అద్దంకి రోడ్డులో ఉన్న వెంకటేశ్వర ఫంక్షన్ హాలులో ఉదయం 10-30 గంటలకు అదాలత్ జరుగుతుందని తెలిపారు. విశ్రాంత జిల్లా జడ్జి, సీజీఆర్ఎఫ్ చైర్‌పర్సన్ విక్టర్ ఇమ్మానియేలు అధ్యక్షతన కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. డివిజన్ పరిధిలో విద్యుత్ బిల్లుల్లో తేడాలు, లోటల్టేజ్ సమస్యలు, ఇతరాలకు సంబంధించి దీర్ఘకాల సమస్యలపై వినతిపత్రాలు తీసుకుంటామని పేర్కొన్నారు. బాపట్ల జిల్లా ఎస్ఈ ఆంజనేయులు, ఇతర అధికారులు హాజరవుతారని తెలిపారు. ఈ అవకాశాన్ని అద్దంకి డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు వినియోగించుకోవాలని కోరారు.

అర్హుల పింఛన్లు రద్దు అయితే సంప్రదించాలి

బల్లికురవ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు ఎవరైనా అర్హత ఉండి పింఛన్లు రద్దు అయితే వెంటనే వారు మరో మారు చీరాల ఏరియా వైద్యశాలను సంప్రదించి తమ వద్ద ఉన్న సదరం సర్టిఫికెట్లను అందజేయాలని జిల్లా దివ్యాంగుల విభాగం ప్రధాన కార్యదర్శి దమ్ము అంజయ్య కోరారు. ఇప్పటికే కొందరు దివ్యాంగులకు పింఛన్లు రద్దు చేశామని అధికారులు నోటీసులు జారీ చేస్తున్నారని తెలిపారు. వెంటనే తమ సర్టిఫికెట్లను పునఃపరిశీలన చేసుకొని వెంటనే ఎంపీడీవో కార్యాలయంలో అందజేస్తే తిరిగి పింఛన్లు మంజూరు చేస్తారని తెలిపారు.

దరఖాస్తుల స్వీకరణ గడువు పొడిగింపు

మార్టూరు, ఆగస్టు18 (ఆంధ్రజ్యోతి): విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేటు యాజమాన్య పాఠశాలలోని 25 శాతం సీట్ల ప్రవేశాలకు దరఖాస్తుల తుదిగడువును ఈ నెల 20వతేదీ వరకు రాష్ట్ర ప్రభుత్వం పొడిగించిందని ఎంఈవో వస్రాం నాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అంతేగాకుండా గతంలో ఒక పాఠశాల నుంచి ఒక కిలోమీటరు లోపల ఉన్న వారి దరఖాస్తులను మాత్రమే పరిగణనలోకి తీసుకునేవారమని, ప్రస్తుతం 3 కిలోమీటర్లు లోపల వారికి కూడా ప్రవేశ అవకాశం కల్పించారని వివరించారు. అందుకు సంబంధించి సీఎస్ఈ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అర్హులైన పేద, మధ్యతరగతి విద్యార్థుల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేటి నుంచి ఆధార్ ప్రత్యేక క్యాంప్‌లు

అద్దంకిటౌన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాలలోని ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల బయోమెట్రిక్ కోసం మంగళవారం నుంచి ప్రత్యేక ఆధార్ క్యాంప్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో బత్తిన సింగయ్య ఒక ప్రకటన ద్వారా తెలిపారు. 19నుంచి 21వ తేదీ వరకు బొమ్మనంపాడు, తిమ్మాయపాలెం గ్రామాల్లో, 22న శంఖవరప్పాడు, చక్రాయపాలెం గ్రామాల్లో, 28 నుంచి 30వ తేదీ వరకు ధర్మవరం, మైలవరం గ్రామాల్లో ప్రత్యేక ఆధార్ క్యాంప్‌లు జరుగుతాయని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఘనంగా రేణుకమ్మ వారి వార్షిక వేడుక

పంగులూరు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి) : పంగులూరులో బాచిన వారి వంశదేవర రేణుకమ్మ వారి 14వ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. గ్రామ ప్రధానకూడలిలోని రేణుకమ్మతల్లి ఆలయం నుంచి మేళతాళాలతో పుట్టవద్దకు చేరుకుని శాస్త్రోక్తంగా పూజలు చేశారు. అనంతరం ఆలయంలో కొలువుదీరిన రేణుకమ్మ వారికి అభిషేకాలు, పూజలు నిర్వహించి పొంగళ్ళు, దద్దోజనం నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు డాక్టర్ బాక్టర్ బాచిన చెంచుగరటయ్య, చెంచుప్రసాద్‌తో పాటు బాచినవంశస్థులు, మహిళలు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న మహిళలు

అవీఇవీ

బాపట్ల జిల్లాకు దుగ్గిరాల పేరును చేర్చాలి

ఆర్డీవోను కలిసిన వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు



వాకర్స్‌తో మాట్లాడుతున్న ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

చీరాల, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల జిల్లాకు స్వాతంత్ర్య సమర యోధులు దుగ్గిరాల గోపాలకృష్ణయ్య పేరును చేర్చాలని చీరాల వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. సోమవారం ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడును మర్యాదపూర్వకంగా కలిసి మాట్లాడారు. చీరాల - పేరాల ఉద్యమ సమయంలో గోపాలకృష్ణయ్య కష్టాన్ని, పోరాట పటిమను వివరించారు. మహనీయులకు గౌరవం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలుదాసు రామకృష్ణ, తదితర ప్రతినిధులు ఉన్నారు.

కోలలపూడి స్కూలుకు దాత రూ.10 లక్షలు విరాళం

మార్టూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోలలపూడి గ్రామంలో జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులు మధ్యాహ్నం భోజనం చేయడానికి గది నిర్మాణానికి పూర్వ విద్యార్థి, ఎన్ఆర్ఐ కందిమళ్ల వేణుబాబు 10 లక్షల రూపాయలను విరాళంగా అందజేశారు. కోలలపూడి గ్రామానికి చెందిన ఆయన అమెరికాలో డాక్టరుగా వైద్య సేవలను అందిస్తున్నారు. ఈ మేరకు సోమవారం జడ్పీ హైస్కూల్‌లో గది నిర్మాణానికి గ్రామస్థులు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ సతీష్‌కుమార్, ఎంఈవో వస్రాంనాయక్ లు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ కార్యక్రమంలో బెజవాడ రామకృష్ణయ్య, సాదినేని హనుమంతరావు, కందిమళ్ల ఆంజనేయులు, కందిమళ్ల రామకోటేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ బ్రహ్మయ్య, ప్రధానోపాధ్యాయులు ప్రసాద్, ఉపాధ్యాయులు రవి, కరిముల్లా, వీరాస్వామి పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ విద్యార్థికి రోటరీ క్లబ్ ఆర్థిక సాయం



విద్యార్థికి ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

అద్దంకిటౌన్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి) : రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్న పేద విద్యార్థికి ఆర్థికసాయం అందించారు. పట్టణంలోని గానుగపాలెంకు చెందిన పఠాన్ అఫ్రిదిఖాన్‌కు రోటరీ మాజీ అధ్యక్షుడు ఊటుకూరి రామకోటేశ్వరరావు సౌజన్యంతో 20 వేల రూపాయలు ఆర్థిక సాయం అందించినట్లు క్లబ్ అధ్యక్షుడు బాచిన శివధర పూర్ణచంద్రరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ కార్యదర్శి ఆళహరి హరిప్రసాద్, ట్రెజరర్ తమ్మన శ్రీనివాసరావు, లేవి ప్రసాద్, వీరయ్య, పి. రామకోటేశ్వరరావు, అంజాద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా జమియత్ ఉలామా ఎన్నికలు



ఎన్నికలు నిర్వహిస్తున్న పెద్దలు

వేటపాలెం(చీరాల), ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం మండలం జమియత్ ఉలామా మండల ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. మత పెద్దలు ముఫ్తీఅబ్దుల్లా ఎన్నికలు పర్యవేక్షించారు. అనంతరం నూతన కమిటీ ముస్లిం సమాజ సంక్షేమం, విద్యాభివృద్ధి, సమస్యల పరిష్కారం కోసం పాటు పడాలని సూచించారు. ఉపాధి అవకాశాలు మెరుగు పరిచి ఆర్థిక భరోసా కల్పించాలని సూచించారు.

తహసీల్దార్‌ని సన్మానించిన కమిటీ సభ్యులు



తహసీల్దార్ ప్రభాకరరావుని సన్మానిస్తున్న సభ్యులు

చినగంజాం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి) : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావుని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీస్ ఐక్య వేదిక కమిటీ సభ్యులు సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు జ్యోతి రమేష్‌బాబు మాట్లాడుతూ తహసీల్దార్ ప్రభాకరరావు గతంలో పొదిలి, అద్దంకి, మర్రిపూడి, చీరాల, పర్చూరు తదితర ప్రాంతాల్లో పని చేసి ఉత్తమ సేవలు అందించారని కొనియాడారు. ఈ నెల 15న జరిగిన స్వాతంత్ర వేడుకలలో తహసీల్దార్ ప్రభాకరరావు అవార్డు అందుకోవడంతో వేదిక ప్రతినిధులు సత్కరించారు. కార్యక్రమంలో నేతలు తెలగతోటి రాధా కృష్ణమూర్తి, జ్యోతి డేవిడ్, జైభీమ్ చంటిబాబు, కొమ్మాలపాటి బుజ్జి, ఏపీఎస్ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా కాంతారావు, మదర్సా ప్రిన్సిపాల్ సయ్యద్ హుస్సేన్ పాల్గొన్నారు.

ఎన్‌టీఆర్ విగ్రహం ఏర్పాటుకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న టీడీపీ నేతలు

అద్దంకి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి) : మండలంలోని చక్రాయపాలెంలో ఎన్‌టీఆర్ విగ్రహం ఏర్పాటుకు టీడీపీ నాయకులు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు రాయుడు నరేంద్రబాబు, గోగులమూడి రాజశేఖర్, మలిపెద్ది రవీంద్రబాబు, వంకాయలపాటి కోటేశ్వరరావు, మేడిద హనుమంతరావు, గొల్ల వెంకటరావు, గొట్టిపాటి సత్యనారాయణ, గుమ్మడి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.